TPLA101B103

అన్నా - చెల్లెలు

[నాటకం]

పినిశెట్టి శ్రీరామమూర్తి

దేశికవితా మండలి
విజయవాడ-2

దేశి ప్రచురణ
ప్రథమ ముద్రణ
ఆగష్టు – 1952
కిసాన్ ప్రెస్
– విజయవాడ
హక్కులు కర్తవి
వెల: రూపాయిన్నర

సంపాదకులు:

బొందలపాటి శకుంతలాదేవి

శివరామకృష్ణ

7

పాత్రలు

సీత	:	జబ్బులోవున్న రామయ్యకూతురు, వయస్సు-		15
సత్యం	:	దర్జీ, రామయ్య దూరపుచుట్టం	,,	22
సూర్యం	:	కారు కండక్టరు. సీత అన్న	,,	25
రంగడు	:	పేపర్లఅమ్మే కుర్రాడు. సీతతమ్ముడు	,,	13
పంతులు	:	పేపర్ల ఏజెంటు, వేళభక్తునివేషం.	,,	40
చలపతి	:	రంగనాథంగారి మేనేజరు. కపటి	,,	45
పిచ్చయ్య	:	మాటా, మనిషీ - వక్రమే—	,,	60
శంకరం	:	జాలిలేని వైద్యుడు	,,	50
యస్. ఐ	:	ఇష్టాన్నిబట్టీ, వీలునుసరించీ వయస్సు ఏర్పాటుచేసుకోవచ్చు.		
పోలీసు	:			

ఒకటేరంగం : రామయ్యగారి ఇంటిచావిడి ఎదురుగా గుమ్మంతప్పకుండా వుండాలి. ఇంట్లోకివెళ్లేవాళ్లంతా ఆగుమ్మంలోనించేవెళ్లాలి.

నా లిఖితపూర్వకమైన అనుమతి పత్రంలేనిదే ఈనాటకాన్ని ప్రదర్శించటంగానీ, స్క్రీన్ చెయ్యటంగానీ, రేడియో బ్రాడ్‌కాస్టింగుగానీ, రికార్డింగు చేయటంగానీ, ప్రచురించటంగానీ చేయరాదు. దీనికి వ్యతిరేకంగా ప్రవర్తించినయెడల ఆయానటీనటులు, నాటకనిర్వాహకులు, నేజరపబోవు సివిల్, క్రిమినల్ చర్యలకు బాధ్యులగుదురు.

ఇట్లు

పినిశెట్టి శ్రీరామమూర్తి

8

* * *

1951 ఏప్రిల్ నెలలో గుడివాడ ఆంధ్ర నాటక కళాపరిషత్తులో ప్రథమంగా ఈ నాటకాన్ని ప్రదర్శించినపుడు పాల్గొన్న నటీ నటులు:

సీత : శ్రీమతి కె. రామతిలకం
సత్యం : శ్రీయుత ఎ. వి. సుబ్బారావు
సూర్యం : ,, ఛమిడిపాటి శ్రీరామమూర్తి
శంకరం : ,, పామర్తి సుబ్బారావు
చలపతి : ,, అడుసుమిల్లి శేషగిరిరావు
పంతులు : ,, లంక సుబ్రహ్మణ్యం
రంగడు : ,, కె. యస్. చలం
పిచ్చయ్య : ,, పినిశెట్టి శ్రీరామమూర్తి
యస్. ఐ. ,, ఛమిడి
పోలీస్ : ,, జక్కంపూడి సత్యం

ఆ నెలలోనే యీ నాటకం తెనాలిలో, ఆంధ్ర నాటక కళాపరిషత్తులో ప్రదర్శించబడింది.

— గ మ ని క —

వీలుగావుంటే ఎఫెక్టుకోసం రెండుమూడు ప్లేబేక్ సాంగ్సు పాడటం మంచిదే - కాని రంగంమీదనే ఏపాత్రచేతనైనా పాడించడానికి ప్రయత్నించారా నాటకం రసాభాసవుతుంది. జాగ్రత్త!

అన్నా - చెల్లెలు

ఒకటవ రంగం

—o—

[రామయ్యగారియింటి చావిడి, యెదురుగా గుమ్మం. గుమ్మంవెలుపల గోడప్రక్కను ఒకపాత సైకిలు, మరోకప్రక్క విరిగినకుర్చి, పాతబల్ల వుంటాయి.

సీత వెలుపలనుంచి కుండతో నీళ్ళుతెచ్చి లోపలకు వెళ్ళబోతుండగా కాళీబిందె పట్టుకుని లోపలనుంచి రంగడు వస్తాడు.]

సీత : యింకా వెళ్ళలేదూ?

రంగ : సిగ్గేస్తుందక్కా!

సీత ; సిగ్గేస్తుందా!

రంగ : యిత్తడి బిందె మీదెవరిస్తారక్కా?

సీత : బంగారపు బిందెయిస్తే యీపాట్లెందుకూ! రంగా! నీకు తీసుకువెళ్ళడానికి బాధగావుంటే అక్కడ పడేయ్ నన్నట్టే వేధించకు.

[సీత లోపలకు వెళుతుంది. విసుగ్గా దీనంగా బిందె తీసుకుని, వీధివైపుకు వెడతాడు రంగడు. సీత చీపురుతో తిరిగివచ్చి చావిడి తుడుస్తూ వుంటుంది. ఒకక్షణం గడచిన తర్వాత సూర్యం వీధిలోంచి వస్తాడు. నెత్తిమీద టోపి తీసుకుంటూ లోపలకు వెళతాడు. తుడుస్తోన్న సీత అలికిడి విని చూస్తుంది. సూర్యం లోపలనుండి వస్తాడు.]

సీత : ఏం జరిగింది?

సూర్యం : ....
సీత : లైసెన్సు యిచ్చారా ?
సూర్యం : లేదు.
సీత : వాయిదా వేశారా ?
సూర్యం : అవును.
సీత : ఎప్పుడు ?
సూర్యం : యింకా పదిహేను రోజులుంది.
సీత : అంతవరకూ బ్రతకడం ?
సూర్యం : ఆ సంగతి వాళ్లు చెప్పలేదు.
సీత : మేనేజరుగారు కనుపించారా ?
సూర్యం : ఆఁ కనుపించారు. డబ్బు అడిగాను...డబ్బులేక బాధపడుతూ, ఎవరన్నా చచ్చేవాళ్లుంటే సుఖంగా చావనిమ్మని చెప్పారు.
సీత : డబ్బు లేనాళ్ళంతా చావాల్సిందే ?
సూర్యం : తప్పకుండాను.
సీత : మరి ప్రపంచం ?
సూర్యం : ప్రపంచానికేం! భారం తగ్గిపోయి తేలికవుతుంది. స్మశానమైతే మరీ సంతోషిస్తుంది....మనిషి బ్రతుకే బాధగావున్న ఈ రోజుల్లో, ఒక మనిషి పోవడమే దేశానికి మహోపకారమేమో.
సీత : ఏమిటన్నాయ్ ఆమాటలు?
సూర్యం : ఏముందీ! డబ్బుగురించే...డబ్బు లేనివాడు మనిషి కాడు. డబ్బులేని మనుష్యులు చావడానికన్నా మరో

మార్గం లేదు.

సీత : పోనీ యాభైరూపాయిలిస్తే నీకిచ్చేజీతంలో మిగహా యిచ్చు కునేవారుగా.

సూర్యం : వుద్యోగం వూడిపోయి కూర్చుంటే ఇంకా జీత మేమిటి?

సీత : ఈవేళ కాకపోతే రేపెక్కుతావుగా బస్... యిక కండక్ట రయిన తర్వాత మూలనే కూర్చుంటావా!

సూర్యం : ప్రస్తుతం మనం బ్రతికే ఆధారమే లేదు. పోతే నాన్న జబ్బు బాగుపడ్డం గురించి యెవరు బాధపడతారు చెల్లాయ్! మనం సరిగాతిని యెన్నాళ్ళయింది?

సీత : మన తిండి ఆతరువాతమాట. పుట్టెడు రోగంతో నాన్న మంచమెక్కాడు... కాళ్ళుపడిపోయాయి... మాట్లాడడు. .....ఏదో చెప్పాలను కుంటాడు... చెప్పలేడు... ఊరికే చూస్తాడు...మనలో యెవరికన్నా రోగం వస్తే అలా వూరుకోగలడా... మనలో యెవరన్నా చావడానికి సిద్ధంగావుంటే......

సూర్యం : చెల్లాయ్! నాకు బాధలేదనుకోబోకు. నాన్నను చూస్తుంటే గుండెలు తరుక్కుపోతున్నాయ్...—సం చేయను...ఏవో ఊహలు ఊహించుకున్న నా జీవితం గతిలేక కారు కండక్టరుగా చేరాల్సినంత దుస్థితి పట్టిం చింది...వెధవవుద్యోగం ప్రతి పోలీసుకు పెద్దనేరం చేసిన వాడిలా చేతులు నలపాలి...ఓవర్‌లోడ్ చేయాలని ఓనరుగోల...తీరా చేస్తే పోలీసు స్టేషనుచుట్టూ తిరగడం

లైసెన్సు ఊడిపోవడం....నాన్న ఒకగుమస్తాగా జీవితాన్నంతా శ్రమించి ఆ రంగనాథానికి బొజ్జపెంచాడు. డబ్బు పెంచాడు... తన బ్రతుకుతో పాటు బిడ్డల జీవితాల్నికూడా నాశనం చేశాడు.

సీత: అన్నయ్యా!

సూర్యం; నేను చచ్చేవరకూ ఇలా వుంటాను. నాకేం పర్వా లేదు, కాని నీకు?

సీత: ఏమిటది?

సూర్యం: నీకు పెళ్ళయ్యే మార్గం లేదు.

సీత: (తల వంచుకుంటుంది.)

సూర్యం: ఆ!-రంగడేడి?

సీత: అలా వెళ్ళాడు.

సూర్యం: వాడి జీవితానికి దారేమన్నా లేదు. చదువుకోవలసిన రోజుల్లో రోడ్డు దుమ్ములో సైకిలెక్కి పేపర్లమ్ముకుంటున్నాడు. పస్తులతో మాడుతున్నాడు. యింతనీచమైన స్థితికి రావటానికి కారణమెవరు? నాన్నకదూ?

సీత: కాదు..

సూర్యం: కాదూ?

సీత: ఎందుకన్నాయ్! చచ్చేనాన్నమీద ఆ కక్ష...నాన్న సంపాదించినంత కాలం ఆ డబ్బు మన సంసారానికే సరిపోలేదు...రంగడి గురించి ఆలోచిస్తున్నావుగాని నీ పనేమయింది—నువ్వు పూర్తిగా చదువుకునుంటే కండక్టరు కావాల్సినంత గతేంపట్టింది నీకు.—నాన్న చేసింది గవ

2u38

ర్న మెంటువారి గుమాస్తాగిరి కాదు, అవసాన కాలంలో పెనేషనే యివ్వడానికి—ఆఖరిదశలో ఆధారంలేకుండా, మనచేతా మనచేతా మాటలు పడుతున్నాడు.

సూర్యం: ఈ పరిస్థితుల్లో ఆరంగనాథం సాయంచేయడం ధర్మం కదూ?

సీత: అది నాన్న తప్పెలాఅవుతుంది—పైగా నాన్న ఒక్కడే కాదుగా అలా గుమాస్తా పనిచేసింది—అనేక వేల మందిలో నాన్న ఒక్కడు.

సూర్యం: వీళ్ళ అతీపతీ తీసుకునే వాళ్లేలేరు. వీళ్ళ అవసరం కూడా బహు తక్కువమందికి వుంటుంది. జీవితపు ఆఖరి దశలో జాగ్రత లేని ప్రతిషావుకారు గుమాస్తా బ్రతుకు యింతే! మళ్ళీ పెద్ద న్యాయంగా సంచరించాలను కుంటూనే ఓ ప్రక్కను అన్యాయంగా ఆ షావుకార్లకు ఆస్తులు గడించి పెడతారీ గుమాస్తాలు.

[రంగడు బిందెతో వస్తాడు]

సీత: ఏమయిందిరా?

రంగ: బిందెమీద ఎవరిస్తారక్కా డబ్బు?

సూర్యం: మంచినీళ్ళు పోసుకునే బిందెకూడా తాకట్టుకు పంపించావన్నమాట.

సీత: ఔను నీ ఒక్కడి గురించి పంపించలేదు. మనందరి గురించే పంపించాను.

సూర్యం: వెధవ బ్రతుకులైపోయాయ్ (లోపలకు వెడతాడు)

రంగ: పిచ్చయ్యతాత రూపాయకు పావలా అయితే యిస్తా

నన్నా డక్కా.స

సీత: ఒకనెలకు రూపాయకు పావలా వడ్డీయే !

రంగ: అద్దైనా మనకు కాబట్టి యిస్తానన్నాడు. బంగారమైతే అణా అట— వెండయితే బేడట.

సీత: యిత్తడికాబట్టి పావలా— పోనీ సుబ్బమ్మగారి దగ్గరకు వెళ్ళలేకపోయావా ?

రంగ: అబ్బో! వెళ్లాను. పెళ్లో దాచుకునేనయితే తాకట్టు పెడతానంది. ఆమె మొగుడూరుకోడట, బిందెలూ, పాత్రలూ పడితే.

సీత: పోనీ మీ ఏజంటు పంతులుగారి దగ్గరకు వెళ్ళలేకపోయావా.

రంగ: వెధవ -అయిదు రూపాయిలకోసం బిందె పట్టుకుని వూరంతా తిరగాలంటావ్ ? నేను వెళ్ళనక్కా.

సీత: రంగా ! నాయనవుకదూ ! పోనీ పావలా అయినాసరే.... వెళ్ళు, పిచ్చియ్యతాత దగ్గరకే వెళ్ళి పట్టుకురా.

రంగ: నేను వెళ్ళలేనక్కా.

సీత: నామాట వినవూ రంగా.

రంగ: (బాధగా విసుగ్గా బిందె పట్టుకుని) పేపర్లమ్ముకునే వేళాయి పోయింది. పంతులుగారు చూస్తే కోప్పడతారు వెళ్ళకపోతే నువ్వూరుకోవు.

[సూర్యం లోపలినుంచి వస్తాడు]

సూర్యం: రంగా ! బిందే లోపల పెట్టు.

సీత: ఏమిటన్నాయ్ అది?

సూర్యం : పీనుగుమీద కూటికాసించే వెధవల దగ్గరకు వెళ్ళొద్దు. మాడి మనం చస్తుంటే రూపాయకు పావలాలు, బేడలూం వడ్డీలు !

సీత : మన అవుసరంకొద్దీ వెళ్లుతున్నాం. వాళ్ళను తిట్టుకొంటే ఏం లాభం ?

సూర్యం : లాభం లేదు కాబట్టే వెళ్లొద్దంటున్నాను.

సీత : మరీరోజు భోజనం.

సూర్య : గడచిపోయిన రెండురోజుల్లాగా గడిపేద్దాం అంతగా లేకపోతే మాడిచద్దాం.

సీత : లోపలకు పట్టుకెళ్ళరా రంగా

[రంగడు లోపలకు వెళతాడు. సీత వెళ్లి చీపురు తీసుకుంటుంది]

సూర్యం : చెల్లాయ్ !

సీత : ఎందుకు ?

సూర్యం : నువ్వాలా చేయడం బాగుందా?

సీత : ఏం చేశాను?

సూర్యం : నలుగుర్లోనేనక తలెత్తి తిరగనక్కర్లేదూ ? ఆఖరికి బిందె కూడా తాకట్టు పెట్టేస్తున్నావంటే నాకు చిన్నతనం కదూ ?

సీత : అన్నాయ్ ! నీకు చిన్నతనంగా వుందా ? చిన్నతనంగానే వుంటుంది. మనం ఆకలి బాధతో మాడేదానికన్నా, నాన్న రోగానికి మందుకూడా యివ్వలేని దుర్గతికన్నా యిదేం చిన్న తనంకాదు——మనకీ పని కొత్తకూడా

కాదుగా, నా చెవుల దిద్దులు, చేతిగాజులు, వడ్డీలు కట్ట లేక విడిచి పెట్టేసుకున్న సంగతి బహుశా మర్చిపోయి వుంటావనుకుంటా.

[రంగడు లోపలనుంచి పేపర్లకట్టతో వస్తాడు]

రంగ : కుండలో ఎక్కడా అన్నం కనుపించదేం అక్కా?

సూర్యం : రామ రామ ఈలాంటి బ్రతుకు బ్రతికేదానికన్నా చావడం నుంచిది.

[లోపలకు వెడతాడు]

సీత : లేంది ఎక్కడ కనుపిస్తుంది?

రంగ : కనుపించదు—పూడేకడుపుతో ఎంతదూరం సైకిలు త్రొక్కను?

సీత : పంతులుగార్నడిగి డబ్బేమన్నా తీసుక రాలేకపోయావూ!

రంగ : తెస్తే కూర్చుని తింటాను.

సీత : నువ్వు తెచ్చే జీతం మరి మాటలా రంగా!

రంగ : ఎంతో కొంత తెస్తున్నాను—తిండి లేకపోతే ఈ ఎండలో మాడి చచ్చిపోవాలి.

సీత : మాటి మాటికీ చావులనే మాట తెస్తే వీపుచిట్ల గొడతాను, వెధవా!

రంగ : నేను అన్నం తినకుండా అసలు సైకిలు ఎక్కేఎక్కను.

[సూర్యం లోపలినుంచి వస్తాడు.]

సూర్యం : రంగా ఏమిట్రా అది?

రంగ : (మౌనం)

సీత: వాడినెత్తి.

రంగ: యిదిగో అక్కా! ఎందుకని వూరుకుంటున్నాను.

సీత: లేకపోతే.

రంగ: నన్నట్టే వాగించకు.

సూర్యం: పేపర్లన్నీ అలా పడేస్తే ఎవరమ్ముతారు?

రంగ: ఏమో!

సూర్యం: ఈ రోజు పేపరు ఈ రోజు అమ్మకపోతే రేపెవ్వడు తీసుకొంటాడూ అంట!

రంగ: ఏం చెయ్యను అన్నయ్యా? రాత్రి పాచిపోయిన అన్నం కాసింత పెట్టింది అక్క.

సీత: అసలు నువ్వా బిందె ఎందుకు తీసుకెళ్లావో ఆ మాత్రం జ్ఞానంలేదట్రా...అన్నయ్యా నిన్న పొద్దుటినుంచి అసలు అన్నం ముట్టేడా!

రంగ: ఆఁ! తినలేదూ?

సూర్యం: వారంపదిరోజులనుంచి సీత సరిగాఅన్నం తింటోందట్రా!

రంగ: తినలేదూ! రోజూ నేను కాస్తో కూస్తో తింటూంటే మీరుకూడా తింటున్నారనుకున్నాను.

[పేపర్ల కారియర్ మీద సవరుకుంటూంటాడు.]

సూర్యం: పంతులుగారికెంత యివ్వాలిరా జీతం?

రంగ: నేనే యివ్వాలి ఆయనకు అయిదురూపాయలు.

సీత: మొన్ననేగా మనకే రెండురూపాయలు యివ్వాలని చెప్పావ్?

రంగ: ఆకలేస్తుంటే అవీ యివీ తినేసి అప్పు పడిపోయానక్కా.

సీత : గడ్డి తినలేకపోయావ్.

రంగ : మరిఅక్కోయి ;

సూర్యం : నోర్ముయ్. కాసు దిగిపోయి పదిహేను రోజులయింది, యింట్లో గింజలు లేవు...నాన్న చూస్తే చావుబ్రతుకుల మీద ఉన్నాడు. ఆ మాత్రం బుద్ధి లేదురా నీకు.

సీత : మనిషయితే వుండేది.

రంగ : యికపైన నవ్వోజీతం యింట్లోకే తెస్తాలే అన్నయ్యా... యింకేమన్నా తింటే వొట్టు.

[వాడుకోసం లోపలకు వెళతాడు]

సీత : అబద్ధ మాడకుండా ఒక్కరోజుండలేడు.

సూర్యం : వాణ్ణేమనకు చెల్లాయ్.

సీత : అంటే లాభంలేదు. నాలుగు చురకలు తగిలించాలి. అంతవరకూ బుద్ధిరాదు.

సూర్యం : చెల్లాయ్ !

సీత : నీగారాబమే వాణ్ణి అలా తయారుచేసింది. నువ్వుగట్టిగా కసురుకుంటే అలా చేయగలుగుతాడా !

సూర్యం : వాడల్లా తయారుకావడం వాడిదోషంకాదు చెల్లాయ్, ఆనందంగా, ఆడుతూ పాడుతూ ఉండేరోజులు...చీకు చింతా లేకుండా సంతోషంగా గడపవలసిన వయస్సు... అప్పుడే వాడికి సంసారం, బాధ్యత...సాధింపులూ ఏ మొగం పెట్టుకొని వాణ్ణి .గదుముకోవాలో చెప్పు చెల్లాయ్ !

[రంగడు తాడుతో వస్తాడు]

రంగ: యిదిగో. నా గురించి ఎవ్వరూ బాధ పడొద్దు...ఈవేళ ఏదోవిధంగా డబ్బు తెస్తాను. లేకపోతే చస్తాను.

సూర్యం: రంగా!

సీత: ఏమిట్రా ఆమాటలు.

రంగ: ఆ—ఏమిటి అంతలోనే అలాగన్నాను. ఓ! అదా! చస్తానంటే నిజంగా తెస్తానన్నమాట.

సూర్యం: (లాలనగా) వెధవమాటలు.

రంగ: అవు నన్నయ్యా నాకు బుద్ధుండొద్దూ? నాన్న వైద్యానికి ఏభైరూపాయలు కావాలి. పంతులుగారిచ్చే జీతం డబ్బు ఎందుకూ సరిపోదనుకో...కానీ అదైనా యింట్లో పడేస్తే బావుండేదిగా. అసలు ఆ పంతులుగారిచ్చే రెండూ మూడూ యింటికి తీసుకొద్దామనే జేబులో వేసుకుంటాను...సైకిలు మీద తిరగడంతనూ. దాహంవేస్తుంది. సోడాకొట్టు దగ్గరకు వెడతాను. అంతా కలర్ తాగేస్తుంటే నేను సోడా తాగకూడదే పుట్టదన్నాన్...కలరే తాగేస్తాను. తీరా తాగిన తర్వాత అణాలు ఊడేస్తాడు. ఆ వున్న డబ్బైనా యింటికి తీసుకొద్దామనుకుంటే కాఫీ హోటల్ జ్ఞాపకంవస్తుంది...హోటల్లోకి వెళతా...బీరువాలో లడ్డూ, బల్లమీంద యిడ్లీ, తినకూడదను కుంటూనే, అడిగి తినేస్తానన్నాయి...తరువాత కాఫీ... బైటకు వచ్చి చూసుకుంటే జేబుకాళీ, ఈ జబ్బు పోవడమెలాగో తెలీడు. యిదుగో, అన్నయ్యా! ఈరోజు

నేను పదిరూపాయలు తెస్తాను. నువ్వెంత తెస్తావో చూస్తాను ... వైద్యుడు శంకరంగారికొట్టంతిచ్చి...... యింట్లోకి బియ్యం, పప్పూ, ఉప్పూ, అన్నీ కొనేద్దాం.

సూర్యం : (ఆనందంగా) నిజమేనురా రంగా !

రంగ : అబద్ధమునేది నీదగ్గర ఆడలేనుగా అన్నాయ్.

సీత : నా దగ్గరైతే......

రంగ : అలవాటయిపోయింది మరి.

[సైకిలు తీసుకెళ్లబోతూంటే పిచ్చయ్యతాత ఎదురు వస్తాడు]

రంగ : (ఆగి) ఆఁ అనుకున్నపని అయినట్లే.

పిచ్చి : ఏం. నేనేమరొచ్చాననా ! నా ఎదురు బంగారం! నేనూ బటికి చెడ్డోణ్ణి.

రంగ : నీకు తెలుసు ?

సీత : ఒరే రంగా.

పిచ్చి : ఆ మాటన్నావంటే నా వొళ్లు మండుద్దబ్బాయూ.

రంగ : చన్నీళ్లు పోసుకో తాతా.

సూర్యం : నీక్కాదురా చెబుతుంట.

రంగ : పిచ్చియ్యతాతా ! నీకూతురు రాజుతో కులుకుతోంది లే.

[సైకిలెక్కి వెళ్లిపోతాడు]

పిచ్చి : సూశావా అబ్బాయూ ! బటికి చెడ్డోణ్ణి ఎంతెంత మాట లనేస్తున్నాడో.

సీత : చిన్నతనంకదూ తెలీదులే తాతా.

పిచ్చి : నా కూతురు పేరెత్తేరంటే ఏమైతే అదయ్యేది. పాణాలు తీసేస్తాను...ఆ చెడిపోయింది నాకూతురేంటి!

సీత : నీ కూతురుకానిదే... నా కూతురు మాటెత్తితే అంటా వేమిటి పిచ్చియ్యతాతా?

పిచ్చి : కూతురే! చెడిపోయింది. చెడిపోయిందాన్ని కూతురనం టానేంటి?

సూర్యం : ఏమంటావ్ ?

పిచ్చి : ఏదో అంటాను. అంతా నీకనవసరం. దాని పేరెత్తితే ఒళ్లు మండుకుపోద్ది. అసలు బతికి చెడ్డోణ్ణి! మా వంశంలో మచ్చే లేదు.

సీత : ఏదో డబ్బుతో తులతూగి పోతోందటగా. నువ్వింకా యిలా తిరగడం ఎందుకు ?

పిచ్చి : మళ్ళీ జన్మలో దాని ముకం సూత్తానా!

సూర్యం : పిచ్చితాతా కోప్పడకు...ఎప్పుడన్నా రమ్మనమని కబురు పెట్టిందా ?

పిచ్చి : ఓ ! సాలాసార్లు కబుర్లు పెట్టింది. నేనెల్తానేంది. నేను బతికి చెడ్డోణ్ణి.

సీత : అప్పుడప్పుడూ తినటానికి ఏకో పంపిస్తా వుంటుందంటగా?

పిచ్చి : ఎవరు చెప్పారు? ఆర్ని పేణంతీసేత్తాను.

సూర్యం : ఏదో ఒకటి రెండుసార్లు పంపించింది. పంపి నేమాత్రం అలా చెప్పుకో వచ్చేమిటి!

పిచ్చి : అద్దిగదీ ! పంపించిందే. పంపితే బతికిచెడ్డోణ్ణి రెండు మిఠాయుండలకన్నా ఎక్కువ తీసుకున్నానేంటి ?

[సూర్యం, సీత నవ్వుతారు.]

పిచ్చి : నవ్వుతే నాకొళ్లు మండుద్ది. బతికి చెడ్డోణ్ణికాబట్టి చెప్ప లేక చెప్పాను.

[సత్యం, భుజంమీద టేపుతో కాస్త మంచి దుస్తులే వేసుకుని వస్తాడు]

సత్యం : నీ బతుకు చెడింది.

పిచ్చి : మిషనుకుట్టు సత్తైనా ?

సత్యం : మరె!

పిచ్చి : పని బాగా సాగుతోందా బుల్లోడా ?

సత్యం : నా పనికేంలెద్దు. నీ వడ్డీవ్యాపారం ఏలాగుంది ?

పిచ్చి : యిదేంటబ్బాయో ! ఎవరన్నా వడ్డీకి పెట్టమని పంపిత్తే తెత్తాను. ఏదో బతికిచెడ్డోణ్ణి నా దగ్గరెక్కడిదీ!

సత్యం : మీ అమ్మాయి చేసి బాగానే బ్రతుకుతుందిగా !

పిచ్చి : నా దగ్గరామాట ఎత్తొద్దబ్బాయూ!

సత్యం : ఏంచాటుచాటు నదుకుంటున్నావుగా పాతికాపరకాను!

పిచ్చి : ఎవరు చెప్పేరంటి ?

సత్యం : మీ అమ్మాయే.

పిచ్చి : దాని పేణం తీసేత్తాను. బతికి చెడ్డోణ్ణి మాటంటే పడను తెలుసా?

స్వగతం : ఎందుకులే సత్యం పిచ్చియ్యతాంతకో.

సత్యం : బ్రతికి చెడ్డోడట! కన్నూమిన్నూ కానకుండా ఉన్న రోజుల్లో డబ్బంతా వెధవహోదాలకు, మోగాభిలకు, తగలేసి చెట్టుపేరుచెప్పుకుని కాయలమ్ముకుంటూన్నోళ్లు ఈ బాపతువాళ్లే మనుష్యులందరూ, "బతికిచెడ్డోళ్లం" యిదొక పెద్ద అలవాటయిపోయింది. పైగా ఉన్నది

ఉన్నట్లుగా మాట్లాడ్డం వీళ్ళకు చేతగాదు. కాస్తోకూస్తో ఆకూతుకు దగ్గర ఒమక్కుతింటూ వుంటారు. పైగా తిడుతూవుంటారు.

పిచ్చి : బతికి చెడ్డోణి కాబట్టి నాకాగాధ. దానిదగ్గర డబ్బు తీసుకుంటున్నా నంటే ప్రజలేమను కుంటారు బుల్లోడా!

సూర్యం : అసలు తీసుకుంటున్నావా?

పిచ్చి : అది తర్వాతమాట. పంచాయితీబోర్డు లెంబరు చేశాను నువ్వెరుగుదువా? నోరడిపోయిందికాని మీబాబు సెప్పే వోడు దానికి సాచ్చం—రంగనాధమున్నాడే ఆడూ చెడి బతికినోడు. ఆళ్ళబాబు ఏం చేశాడో తెలుసా? కొనస్సోసి ఓళ్ళ దగ్గర సెరకు. ఆ రంగనాదాన్ని మీ బాబేగా గుమస్తాగావుండి బాగుచేసింది. మీనుమట్టుకే సత్తెం మాత్రం బతికి చెడ్డోడే.

సత్యం : ఆమాట అనొద్దంటున్నాను.

[సీత వస్తుంది.]

పిచ్చి : ముక్కుచివరుంటుంది కోపం.....ఏనమ్మో సీతమ్మో సత్తెన్ని మాత్రం పెళ్ళిచేసుకోబోకు—మీబాబుకు చేద్దా మని వుందిలే, ఆ సంగతి నోరున్నప్పుడు నాతో చెప్పేడు.

సత్యం : నువ్వు వెళతావా వెళ్ళవా?

పిచ్చి : బతికి చెడ్డోన్నెవ్వ అలా అనమాకమ బుల్లోడా.

సత్యం : ఆ మాట వొప్పుకొను.

పిచ్చి : బాగానేవుంది—ఏంటమ్మా ఈ మిడిసిపాటు.

[వెళ్ళిపోతాడు]

సూర్యం : సత్యమంటే పిచ్చియ్య తాతకు భయమే.

సత్యం : ఈ లాంటి వెధవల్ని చూస్తేనాకు భయమేమంట—కూతురికి చిన్నప్పుడే పెళ్ళిచేసి దాని గొంతుకోశాడు. వెధవ ముండనని యింట్లో కూర్చోబెట్టాడు. సంపాదన లేదు. గతంలో గొప్పని చెప్పుకుంటూ, గాలికి బతికేసికం.

సీత : పెద్దకబుర్లు చెపుతావ్ కాని ఆ పిల్లచేసిన పని తప్పు కాదేమిటి?

సత్యం : ఏమీ తప్పు లేదంటాను.

సూర్యం : వ్యభిచారం చేసే వాళ్ళంటే నీకిష్టమనుకుంటాను.

సత్యం : వ్యభిచారాన్ని సమర్థించను.

సీత ! నీ మాటలకు అర్థం ?

సూర్యం : అది వాడికే తెలీదు.

సత్యం : ఒక మనిషి తప్పును మనం చెప్పుకోనేటప్పుడు ఆ తప్పు ఏ పరిస్థితుల్లో చేయాల్సివచ్చిందో ముందుగా ఆలోచించాలి. ఈ పిచ్చియ్యతాత జబ్బుపడ్డాడు. తండ్రికోసం కాంతం ఆ పని చేసింది. చేస్తున్నదని వాడికి తెలుసు, అయితే ఇనుగు.హ పక్కి- తెలియలేదనే ధైర్యంతో చూసీ చూడనట్టువూరుకున్నాడు, ఆ అవకాశాన్ని ఆధారంగా చేసుకుని మరీబహిరంగంగా తిరగటం మొదలెట్టింది. వూరంతా ఒక్కసారే గుప్పుమంది. అప్పుడే ఒళ్ళు

మండింది పిచ్చియ్యతాతకు. మొగుడుకొట్టినందుకు ఏడవ లేదట, తోటికోడలు దెప్పినందుకు ఏడ్చిందట. ఆ సామ్యాంగా వుంది, పిచ్చయ్య తాత బ్రతుకు.

సీత : ఏది ఏమైనప్పటికీ ఆ పిల్ల ఆ పని చేయటం తప్పుకదూ ?

సూర్యం : నీతనేది మర్చిపోయినవాళ్ళు అది తప్పు లేదని చెప్పడంలో కూడా తప్పు లేదు లే.

సత్యం : నేనుచేసేది మిషను పనైనా గ్రంథాలు చదవడానికి నీ కన్నా నాకే ఎక్కువ అవకాశం. ఆ అవకాశాన్ని మా మిషను పనివాళ్ళు చాలామంది వినియోగించుకోరనే సంగతికూడా నిజమే. అయితే నాకా బద్ధకంలేదు. మీ రిద్దరూ తెలుసుకునే దానికన్నా నాకు ఎక్కువ 'తెలుసు' ఆ మాట మీరుకూడా ఒప్పుకుంటారు. ఆ అనుభవంతోనే మళ్లా చెపుతున్నాను.

సూర్యం : దాన్నేమంటారు ?

సీత : పతివ్రత అంటారు.

సత్యం : ఆమె భర్తుంకి బ్రతకడానికి తిండుంటే ఈ పురాణాల్లో చెప్పే ప్రతివ్రతలకన్నా, శీలవతే కానచ్చుంటాను.

సూర్యం : ఆమె చేసిన పనిపేరు ?

సత్యం : సమాజం ఆమెకు చేసిన ద్రోహం.

సీత : ఈ మధ్య రాజకీయ పుస్తకాలు చదువుతున్నాడల్లేవుంది.

సూర్యం : కాదు, ఇతర దేశాల పుస్తకాలు తెలుగు భాషలో కూడా రాస్తున్నారులే. బహుశా అవి చదివి వుంటాడు.

సత్యం : కావచ్చు...యితరదేశాలతో మనదేశాన్ని పోలిస్తే వంద సంవత్సరాలు వెనకున్నాం మనం. పది సంవత్సరాలు ముందుకు పోవడానికి ముందులో చేసే ప్రయత్నం ఫలితం పొందాలంటాను. ఆశయాలు అపారంగా వుండి ఆచరణ అల్పమైతే అసలు ఆదర్శమే శూన్యమౌతుంది.

సీత : ఎవరితో మాట్లాడుతున్నావ్ ?

సత్యం : మీ యిద్దరితో!

సూర్యం : ఏదో గోడతో మాట్లాడుతున్నావని మా చెల్లాయ్ అడిగింది.

సత్యం : మీరిద్దరూ గోడలనే భావం మీ కేవుంటే నేనింతవరకూ మాట్లాడటం అనవసరమని అనుకుంటాను.

సీత : మాటలు నేర్పు బాగానే వుంది సత్యానికి.

సూర్యం : పదిళ్ళు తిరుగుతూ, పదిమందితో ఎప్పుడూ వాగేవాడికి మాటలన్నా సంపాయించకపోతే...

సత్యం : మాటలు సంపాదిస్తామా ? మంచి మాటన్నావురా ? మాటంటూ వుంటే మీ కల్గినకష్టంలో కాస్త పాలైనా పంచుకోకుండా వుంటానా ?

సీత : (లోపలకు వెళ్ళిచూసి కంగారుగా) అన్నయ్యా! అన్నయ్యా ? నాన్న ఒళ్ళంతా చల్లబడిపోయింది.

[కంగారుగా సూర్యంలోపలకు వెళతాడు. సత్యం గుమ్మంలోనిల బడతాడు. సీత తెలుపలకువచ్చి పిచ్చిగా వీధిలోకి వెళ్ళబోతుంది.]

సత్యం : ఎక్కడికి సీతా ?

సీత : శంకరంగారి దగ్గరకు.

సత్యం : డబ్బులేనిదే ఎలాగొస్తాడు ?

సీత : ఔను సత్యం. యింతవరకూ ఎంతో సహాయం చేశావ్... అన్నయ్యకు నౌకరీ వూడిపోయింది. నాన్నరోగం ముంచు కొస్తూ వుంది.... ఎలా అడగాలో నాకూ నోరురావడం లేదు. ఏభైరూపాయలు కావాలి...

సత్యం : ఎందుకూ ?

సీత : శంకరం గారు కావాలన్నారు.

సత్యం : ఏభై రూపాయలే!

సీత : ఔను:

సత్యం : వాడి దగ్గరున్న మందులన్నీ అమ్మినా ఏభైరూపాయల ఖరీదుండవ్...యాభై రూపాయలడిగేడా.

[సూర్యం లోపలనుంచి వస్తాడు]

సత్యం : (లోపలకు వెళతాడు)

సీత : ఎలాగుంది?

సూర్యం : ప్రాణంపోలేదు...పోదు కూడా.

సీత : అవేం మాటలన్నాయ్ !

సూర్యం : నేనలా వెళ్ళొస్తాను.

సీత : ఎక్కడికి ?

సూర్యం : డబ్బుకోసం

సీత : ఎవరి దగ్గరకు ?

సూర్యం : నాన్నకు ఈ దుస్థితిని కలిగించిన వాడెవడో వాడిదగ్గరకు.

సీత : రంగనాథం దగ్గరకా ?

సూర్యం: ఔను.

సీత: అసలు అతన్ని చూడ్డానికి అవకాశం వుంటుందా?

సూర్యం: అవకాశాన్ని కలిగించుకుంటాను, అడ్డొచ్చే వాళ్లు ఎవరన్నా ఉంటే ఆవలకు నెట్టుతాను.

సీత: అన్నాయ్!

[సత్యం లోపలనుంచి వస్తాడు]

సూర్యం: గుండెలమీద గుద్ది మాట్లాడిస్తాను. న్యాయానికి శిక్ష ఎందుకో, ధర్మానికి ఇంత దగా దేనికో అడుగుతాను.

సత్యం: సమాధానం చెప్పకపోతే?

సూర్యం: చావగొడతాను.

సత్యం: అంతలో మీ నాన్న ఆరోగ్యవంతుడౌతాడు.

సూర్యం: సత్యం!

సత్యం: సత్యమే చెప్పాను.

సూర్యం: నువ్వు అబద్ధమే చెప్తున్నావ్! అన్యాయాలను సమర్థిస్తున్నావ్,

సత్యం: నన్నంతవరకు అర్థంచేసుకున్నావ్.

సూర్యం: అర్థంకాదు......యథార్థంకూడా అంతే.

సత్యం: అయితే వెళ్ళిరా!

సూర్యం: నీ సలహాను కోరలేదు.

సత్యం: సంతోషం.

సూర్యం: సంతోషం...మా గురించి ఎవ్వరూ విచారించరు... అందరికీ సంతోషమే. అంతా మమ్మల్ని విరోధులుగా, హీనులుగా దరిద్రులుగా చూస్తారు. దూరంగా

తప్పుకుంటారు. నువ్వుకూడా వాళ్ళల్లో చేరిపోయావ్ ...నా నౌకరీతో పాటు నా స్నేహితులుకూడా పోయారు ...వాళ్ళని అప్పడుగుతానని అదురుగా చూస్తూ ప్రక్క దార్లని పోతున్నారు...నువ్వు కూడా వెళ్ళిపో, మా యింట్లోంచి వెళ్ళిపో.

[సీత కంగారుగా వస్తుంది]

సీత : ఏమిటన్నాయ్ అది...ఏమంటున్నావ్ ! సత్యాన్ని వెళ్ళి పొమ్మంటున్నావా. అతను చేసిన సహాయాలకు యిదేనా నువ్వు అనవలసినమాట. మన గురించి అతను అనేక మందికి అప్పుపడ్డాడు...అతనికి మనం అప్పు పడ్డాం... యిది స్నేహంలో అనవలసిన మాటేనా !

సత్యం : నీకాకంగారెందుకు సీతా ? వాడి కష్టసమయంలో నన్ను నక ఎవర్నంటాడు. చాలినంత సహాయం నేను చేయ లేకపోయిన మాట నిజమే. చేయాలని నాకుంది. చేతికి మాత్రం అందటం లేదు. నా వృత్తే అలాంటిది.

సీత : ఏమీఅనుకోబోకు సత్యం. అన్నయ్యమనస్సు పాడైపోయింది.

సత్యం : ఏమన్నా డబ్బుకోసం ప్రయత్నిస్తాను. వాడన్నందుకు బాధపడ్డంలేదు...మీ పరిస్థితులకు సిగ్గుపడుతున్నాను. వెడతారా సూర్యం.

[వెళ్ళబోతాడు]

సూర్యం : (కన్నీళ్ళతో) సత్యం !

సత్యం : (వెనక్కు తిరుగుతాడు)

సూర్యం : (కౌగిలించుకుని, తలవంచుకుని) ఏదో అన్నాను, ఎందు కన్నానో నాకే తెలీదు. క్షమించు.

సత్యం : సూర్యం !

సూర్యం : మా నాన్నకు రోగం...యింట్లో బియ్యపు గింజ లేదు. రంగడు కడుపులో ఆకలితో, కళ్లు తిరుగుతున్నాయంటూ సైకిలెక్కి వెళ్లాడు... మా చెల్లాయ్ రెండురోజులయింది అన్నంతిని...ఏదో విధంగా డబ్బు తేవాలి...ఎక్కడికన్నా వెళ్ళి తేవాలి.

[విసుగ్గా బైటకు వెళ్తాడు]

సత్యం : సీతా !

సీత : ఏం ?

సత్యం : నేనుకూడా యింటికి వెళ్తాను.

సీత : ఎందుకూ ?

సత్యం : అబ్బే వూరికేనే.

సీత : సత్యం ! నీ సంగతి నాకు తెలుసు......అప్పుచేసి మిషన్ కొన్నావు. ఆ అప్పు అలాగే వుండిపోయింది.

[శంకరం వస్తాడు వేషం డాంబికంగానే వుంటుంది]

శంక : ఏలా వుందమ్మాయి ?

సీత : శంకరంగారా !

శంక : మీకు శ్రద్ధలేపోయినా ఆరోగి గురించి నా కన్నా శ్రద్ధ వుండాలిగా... తీరా చేయి చేసుకున్నాను ... పోతే పోతాడులే అని మీలాగా ధైర్యం చేసుకుని నేనుకూడా కూర్చుంటే...

సీత : శంకరంగారూ ! అలా అనొద్దు

శంక : ఏమనాలి ? రెండురోజులయింది నేను వచ్చి. కాస్తంత మందుకోసమన్నా కబురు పంపేవా ?

సీత : డబ్బెక్కడా అందలేదండీ.

శంక : అందదని నాకు తెలుసు...వైద్యుడంటే అసలే అందడు. అసలు వైద్యమే అలా అయిపోయింది. పైగా అందరూ వైద్యులే అయిపోయారు.

సత్యం : మీలాగే,

శంక : నా వైద్యాన్ని నువ్వు పరీక్ష చేయగలవా ?

సత్యం : మీరు వేసిన పరీక్షంటూ ఒకటుంటేగా.

శంక : మా ముత్తాత వైద్యుడు. మా తాత వైద్యుడు. నేను వైద్యుణ్ణి. మా కుటుంబమంతా వైద్యులమే. నాది అనుభవపూర్వకమైన వైద్యం.

సత్యం : ఆ పేరు చెప్పుకునే సుఖంగా నైవేద్యమారగిస్తున్నారు.

శంక : తల బిరుసుగా మాట్లాడుతున్నావే.

సత్యం : దానికేమన్నా వైద్యమున్నదాండి?

సీత : ఆతనితో ఏమిటి రండి, ఒక్కసారి చూసి వెళ్ళుదురుగాని.

శంక : చూసివెళ్ళకపోతే యితని మాటలు వింటూ కూర్చుంటానా ఏమిటి ?

[లోపలకు వెళ్తాడు. తిరిగి సీతతో వస్తాడు]

సీత : ఏలాగున్నదండీ ?

శంక : ఏలావుంటుంది!

సత్యం : డబ్బుకావాలంటుంది నాడి.

శంక : (కోపంగా) సత్యం !

సత్యం : గంతకుతగ్గ బొంతలాగా వాళ్ళ బతుక్కి మీలాంటి మహా మహా వైద్యులు బయల్దేరారు...ఏభై రూపాయలిస్తే ఆయన ఆరోగ్యం కుదుటపడుతుందా ?

శంక : అనేచేస్తాం. ఆ పైన భగవంతుడికృప.

సత్యం : ఆమాత్రం భరోసా లేనప్పుడు డబ్బడగటమెందుకూ ?

శంక : మందులు పైనుంచిమాకు వ్రాసి కేరానటం లేదు.

సత్యం : మందులు పైనుంచి కూడా తెప్పిస్తున్నారా మీరు ?

సీత : ఎందుకు సత్యం వారితో సీకు.

శంక : వెర్రివాణ్ణను కుంటున్నారేమో ?

సత్యం : నిన్నుమల్ని వెర్రివాడనుకునేవాడు వెర్రివాడు. మొన్న క్రొత్తగా డాక్టరు యిట్లా సంపాదించేనా ?

శంక : ఓ ! నీకొకక్కే చెప్పాలి. వెధవ మిమనుకొచ్చి కొట్టు కుంటూరా ?

సత్యం : ఒక్కమాట అడుగుతున్నాను కోప్పడకండి.

శంక : నీకు సమాధానం చెప్పాల్సినంత అవుసరం నాకులేదు.

సత్యం : మీ అవుసరం పూసింది ప్రభూ ! ఆయనకు రోగం యేమిటి ?

శంక : పక్షవాతం !

సత్యం : ఎందుకొచ్చింది ?

శంక : అనారోగ్యం వల్లే.

సత్యం : అనారోగ్యానికి కారణం ?

శంక: ఆహార విహారాలు.

సత్యం: సరైన ఆహారవిహారాలు కావాలంటే?

శంక: ఏమిటి భారతంలో ధర్మరాజుని భేతాలుడు వేసినట్లు వేస్తున్నావ్ ప్రశ్నలు?

సత్యం: అలాగే అనుకోండి. కాని ఒక్క ప్రార్థన. వాళ్ళు పేద వాళ్ళు. డబ్బుంటే సరైన తిండి వుంటుంది. తిండి లేక పోషణం ద్వారానే ఈరోగం వచ్చిందని తమకు తెలుసు. తెలుసుండీ కూడా మళ్లీ మీరే ఆ డబ్బు గురించి వాళ్లను ఒత్తిడిచెయ్యడం ఏమన్నా బాగుందా?

శంక: ఊరికే చెయ్యాలంటావ్?

సత్యం: తమరు చేసేది ఆయుర్వేద వైద్యమనుకుంటాను. బహుశా మీరు ఆ గ్రంథాలు పరిశీలించి వుంటే—

శంక: పరిశీలించ కుండానే వైద్యం చేస్తున్నానా?

సత్యం: అదేవరు చూచారులెండి. తాతలు, ముత్తాతలూ, చేసిన మందులున్నాయని చేస్తే చేయవచ్చుకూడా—కాని భారతదేశం గర్వించదగ్గ ఆయుర్వేదానికి...

శంక: నేను కళంకం తెస్తున్నానంటావ్.

సత్యం: అనడమేమిటి కనిపిస్తుంటే.

శంక: ఏమిటి కనపించేది?

సత్యం: మీ దుర్మార్గం.

శంక: జాగ్రత్తగా మాట్లాడు.

సత్యం: మీరు అజాగ్రత్తగా వైద్యం చేయడం వల్లనే యింత

వరకూ ముంచుకొచ్చింది. జబ్బు తెలియకుండా మందు వెయ్యటం ఆ మందు వికటిస్తే రసాభాసు పెట్టి తానటం.

శంక: నీ సంగతి నేను కనుక్కుంటాను.

సత్యం: ఆ సంగతి తెలుసుకుందామనే నేనూ చూస్తున్నాను.

శంక: నీ వల్ల చేతనయ్యేది ఏమున్నా వుంటే చెయ్యి.

[వెళ్ళి పోతాడు]

సత్యం: ఆగండి. వెళ్ళేరా మీ మర్యాద దక్కదు. ప్రభుత్వపు పట్టాలేకుండా మీరు వైద్యం చేశారు. ఒకజీవితాన్ని నాశనం చెయ్యడానికి సిద్ధమయ్యారు. పూర్తిగా తగ్గిస్తా రా నాళ్ళకు ఉచితంగా వైద్యంచేసి మీరు చేసిన లోపానికి క్షమార్పణ కోరుకోండి. లేదా ఆరోగ్యానికి ఎలాంటి యిబ్బంది కలిగినా మీ పైన కేసుపెడతాను.

[సత్యం వెడతాడు.
సీత లోపలనుంచి వస్తుంది]

సీత: వెళ్ళిపోయాడా అండీ సత్యం

శంక: వెళ్ళాడు.

సీత: ఏమిటాలోచిస్తున్నారు?

శంక: సత్యంతో ఇలాచేస్తే మీకు ఉచితంగా వైద్యంచేస్తానని మీరంతా ఆలోచించారా?

సీత: సత్యంతో ఆవిషయం గురించి అసలు మాట్లాడ లేదండీ.

శంక: మాట్లాడందే వాడలా అడగటానికి అవసరమేమిటి!

[కంగిరౌస్తాడు]

రంగ : శంకరంగారొచ్చారా అక్కా! ఇదిగో.

[పది రూపాయలనోటు చూపిస్తాడు]

సీత : ఎక్కడిది రంగా?

రంగ : ఎక్కడిదో తర్వాత చెప్తాలే. శంకరంగారూ! యీపది రూపాయిలూ తీసుకోండి.

శం : (అందుకుంటాడు.)

సీత : ముందు మందు యిప్పించండి. తర్వాత మా అన్నయ్య యేమన్నా తెస్తే...

రంగ : రండి శంకరంగారూ! నేను వస్తాను. నాచేతికివ్వండి మందు.

సీత : మరొక్కసారి చూస్తారా మా నాన్నను,

శంక : చూశానుగా యింక అక్కర్లేదు. రారా రంగా!

[రంగడు, శంకరం వెళ్తారు. సీతలోపలకు వెళుతుంది. వెలుపల నుంచి నూర్యం... సీత గుమ్మంలోంచి వస్తుంది.]

సీత : ఎవరు?

పంతు : (వెలుపలనుంచే) మీ అన్నయ్య లేడూ?

సీత : పంతులుగారా!

[పంతులు వస్తాడు]

పంతు: ఔను. రంగడెక్కడ?

సీత : ఇప్పుడే మందుకోసం వెళ్ళాడు. మానాన్నకు చాలా ఎక్కువగా వుందండీ!

పంతు: మీ అన్నయ్య ఉన్నాడా?

సీత : లేదు.

పంతు: ఎక్కడ కెళ్ళారు?

సీత : డబ్బుకోసం తిరుగుతున్నాడు.

పంతు: రంగడు కూడా అందుకోసనే తంటాలు పడుతున్నట్లు న్నాడు.

సీత : కుర్రాడు వాడికెవరిస్తాడు?

పంతు: ఇవ్వక పోయినా ఏదోవిధంగా తీసుకురావచ్చుగా.

సీత : మీరనేమాట నా కర్థంకావటంలేదు.

పంతు: అర్థంకాదు. అర్థమయ్యేటట్లు నేనుచేస్తాను. (అని వెళ్ళ పోతాడు)

సీత : పంతులుగారూ!

పంతు: మీ అన్నయ్యా, నేనూ చిన్నప్పుడు ఒకే స్కూల్లో చదువుకున్నాం.

సీత : ఔను.

పంతు: ఆ పరిచయం వల్లే రంగడికి పేపర్లమ్మే ఉద్యోగం యిచ్చాను.

సీత : కాదని ఎవరన్నారు?

పంతు: అందరికీ నెలకు పన్నెండురూపాయలిస్తున్నా. వీడికి పది హేను రూపాయలిస్తున్నాను.

సీత : మంచి పనేచేశారు. మీరింతకూ చెప్పేది?

పంతు: అదిమీఅన్నయ్యను చెప్పేచేద్దామనుకున్నాను. లేదుగా ...చెప్పకుండానే చేస్తాను.

సీత : అదేమిటో నాతో చెప్పకూడదూ?

పంతు: నాపేరు పంతులు. ఈ పట్టణంలో నన్నెరగని వాళ్ళు

లేదు. ఆఖరికి రంగనాథంగారుకూడా నేను చెప్పినంతా చేసితీరుతాడు.

సీత : యివన్నీ యిప్పుడెందుకండీ ?

పంతు : గవర్నమెంటులో కూడా నాకు పలుకుబడివుంది.

సీత : ఉంటే...మీ మాటలేమిటో నాకు అర్థంకావటంలేదు.

పంతు : వట్టి పేపర్ల ఏజంటు వెధవగా చూస్తున్నారేమో.

సీత : మా అన్నయ్య వచ్చేక మాట్లాడుదురుగాని...

పంతు : మర్యాదగానే మాట్లాడుతున్నావా ?

సీత : పంతులుగారూ ! ఒకటి రెండుసార్లు మీరు మాయింటికి వస్తే చూడ్డమేగాని, కారణం చెప్పకుండా యింత ఎక్కువగా మాట్లాడతారని నాకు తెలీదు. తెలుసుంటే మీతో యింతవరకూ మాట్లాడేదాన్ని కాదు. వెళ్ళిరండి నాకు పనివుంది. (అని వెడుతూవుంటుంది)

పంతు : కాస్సేపటికి పోలీసులు వస్తారు.

సీత : ఎందుకూ ?

పంతు: మీరంగణ్ణి స్టేషన్‌కు తీసుకువెళ్ళడానికి.

సీత : ఏం చేశాడని ?

పంతు : వాళ్లే చెబుతారు: వచ్చిన దగ్గరనుంచీ వెళ్లు వెళ్లు అంటున్నావు. యిక్కడ నీతో వుండటానికి రాలేదు.

సీత : [కంగారుపడి కోపంగా చూచి] పంతులుగారూ !

పంతు : రంగడు నా సైకిలు చోరీ చేశాడు.

సీత : ఏమిటీ ?

పంతు : తాకట్టుపెట్టి డబ్బు తీసుకొచ్చాడు.

సీత : ఎప్పుడు ?

పంతు : అరగంటకు ముందు...ఎంత తెలివితక్కువగా మాట్లాడుతున్నావ్. ఆ డబ్బు తీసుకువచ్చి నీకివ్వలేదూ ?

సీత : పదిరూపాయలు పట్టుకొచ్చాడు.

పంతు : ఎక్కడదనుకున్నావ్ ?

సీత : మీదగ్గరే అప్పుగా తీసుకొచ్చాడనుకున్నాను. పంతులుగారూ ! క్షమించండి. మా నాన్నకు రోగం ఎక్కువయింది. వైద్యంచేయించటానికిడబ్బులేదు. రంగడిదిచిన్న వయస్సే అయినా యింట్లో యిబ్బంది వాణ్ణీపని చేయించి వుంటుంది. అది మా తప్పుగా భావించండి. వాడినేం చెయ్యొద్దు. వాడే చేసుకోడ్ని, మీ ఋణాన్ని తీర్చుకుంటాడు...లేదా అన్నయ్య వచ్చి ఆ సైకిలు తీసుకొచ్చిమీకిస్తాడు.

[సత్యం మెల్లగా వస్తాడు]

పంతు : అసలునేను మొండివెధవని. ఏదైనా పని తలపెట్టనే తలపెట్టను. తలచానా తప్పనిసరిగా జరిగితీరాల్సిందే.

సత్యం : పంతులుగారూ ! ఏమిటది ?

పంతు : పంతులంటే ఎట్లాంటిమనిషో నీకూ తెలుసు

సత్యం : తెలిస్తే ?

పంతు : అమ్మాయి, నేను వెళ్తున్నా...మీ అన్నయ్య వచ్చిన తర్వాత నేనువచ్చి వెళ్లానని చెప్పు.

సీత : ఎక్కడికెడతారుమీరు ?

పంతు : రిపోర్టు యివ్వటానికి.

సత్యం : ఎవరిమీద ?

సీత : రంగడు పొరపాటుపని చేశాడు. మీరిసైకిలు తాకట్టుపెట్టి పదిరూపాయలు తెచ్చాడు.

సత్యం : యింతేనా యింకేమిటో పెద్ద పొరపాటు చేశాడను కున్నాను.

పంతు : ఇది పొరపాటుకాదూ ?

సత్యం : వాళ్ళ గ్రహపాటును బట్టి మీరు పొరపాటనుకున్నారు. వాడు చేసిన పని పెద్ద తప్పేంకాదు. సొమ్మవసరం గురించి ఆ సైకిలు అద్దం పెట్టుకున్నాడు...అంతే

పంతు : వాడి సొమ్మా ?

సత్యం : లేకపోతే, వాడు శ్రమించి సంపాదించి ఒకళ్ళదగ్గర అప్ప నంగా నిలవేస్తున్న జీవితంలో కొద్దిమాత్రం సొమ్ము. దానికి పెద్దగొడవ చేస్తారెందుకూ ? పంతులుగారూ ! రంగడు మీదగ్గరచేరి రెండుసంవత్సరాలవుతుంది. అప్పటి నుంచీ సైకిలు వాడి అదుపాజ్ఞలోనే వుంటోంది. ప్రతి రోజూ దాన్ని ఎక్కి త్రొక్కుతూ దానికి చాలా శ్రమ యిచ్చాడు. మీ అవసరానికి దాన్ని అధారంగా తీసు కుని అనేకరోజులు త్రొక్కి కష్టించినప్పుడు...రంగడవస రానికి మీ రక్షపడకపోయినా యినుపముక్క, అది కూడా ఆ మాత్రం సహాయం చేయలేకపోతే ఎలా చెప్పండి.

పంతు : నువ్వు మొండిగా మాట్లాడుతున్నావు. వాడి సొత్తని కాస్సేపనుకున్నా. ఏదోనాడగ్గర అప్పనంగా నిలవేసిన

బాపతని మరోసారన్నావ్. ఆఖరికి యినుపముక్క నా కన్నా వాడికి ఎక్కువ సహాయం చేసిందంటున్నావ్.

సత్యం : కోప్పడకండి. కన్నతండ్రి కష్టదశలో వున్నాడు. ఏదో విధంగా కాపాడుకోవలసిన బాధ్యత ఆ కుర్రాడికుంది. న్యాయంగా అడిగితే మీరివ్వకపోవచ్చు. అందుకే ఆ కుర్రాడు ఆ ధైర్యం చేశాడు, వాడి దుస్థితిని తెలుసుకొన్న మీకు ఏ మాత్రం హృదయమున్నా యీ పరిస్థితుల్లో మీరు వాళ్ళయింటి మీదకు యుద్ధానికి రారు.

పంతు : ఏమోయ్ సత్యం ! పరిచయాన్ని మించి ఎక్కువగా మాట్లాడుతున్నావ్. పంతులంటే నీకు ఎక్కువగా తెలుసుంటే ఇలా మాట్లాడవ్.

సత్యం : తెలుసు... పొరపాటున జైలు పట్టాలు లాగడానికి ప్రయత్నిస్తూ పోలీసు వారికి దొరికారు. అదృష్టవశాత్తు జైలునివాసం దొరికింది. అది ఆధారంగా ఖద్దరుగుడ్డ, ఆనాటినుంచీ కడుతున్నారు, ఆ పలుకుబడితోనే రెండు దినపత్రికలకు ఏజంటయ్యారు. ఆ జైలు సర్టిఫికేటుతో అయాచితంగా అందిన అయిదు ఎకరాలు పోవాయి కారీగా వడ్డీవ్యాపారం, ముఠా రాజకీయాల్లో చేరి మూడు బస్సురూట్లు సంపాయించారు, పైకి దేశభక్తులుగా చలామణీ అయిపోతున్నారు. పంతులుగార్ని నేనెక్కువెరగడ మేమిటోయ్ ?

పంతు : సంతోషించాంలే !
సత్యం : మీ సంతోషానికి చాలా మంది విచారిస్తారు.
పంతు : నోరు కట్టాలి.
సత్యం : తమరు కూడా ఆ పనే చెయ్యాలి.
పంతు : చేస్తాను. చేయాలనేచేస్తాను. ఏ అమ్మాయి : నేను వెళ్తున్నాను.
సీత : ఎందుకండీ ?
పంతు : తరువాత విచారించినా లాభంలేదు.
సీత : మీరు చేసే ప్రయత్నంమానరా.
పంతు : తప్పని సరిగా పోలీసు రిపోర్టుయిస్తాను.
సత్యం : ఏమనియిస్తారు ?
పంతు : దొంగతనం చేశాడని.
సత్యం : వాడిమీద రిపోర్టు యివ్వటానికి వీల్లేదు.
పంతు : నువ్వు అడ్డు పడతావా ?
సత్యం : అవసరం వ స్తే.
పంతు : అయితే సరే ! (వెళ్ళబోతాడు)
సత్యం : పంతులుగారూ !
పంతు : ఏం ?
సత్యం : రిపోర్టు చేస్తారా ?
పంతు : అవును.
సత్యం : దేనికి ?
పంతు : డబ్బు రాబట్టుకోటానికి రిపోర్టు అవసరం కాబట్టి.
సత్యం : రిపోర్టు లేకుండానే డబ్బువస్తే ?

పంతు : ఏ గొడవా లేదు.

సత్యం : (జేబులోంచి పదిరూపాయల నోటు తీసి) అయితే యిదిగో.

పంతు : (ఆశ్చర్యంగా చూస్తాడు)

సత్యం : తీసుకోండి, కాని వాడు నేరస్థుడనుకోవద్దు. పరిస్థితులు వాణ్ణి అలా చేయించాయి....అది కారణంగా వాడి నౌకరీ లేకుండా చేయటం మంచిపనికాదు.

[రంగడు మందుసీసాతో వస్తాడు. పంతుల్ని చూసి మందుసీసాపడుస్తాడు. మందు ఒలికి పోతుంది.]

సీత : ఆఁ !......(ఆశ్చర్యంగా చూస్తుంది)

రంగ : (కళ్ళనీళ్ళతో) చెయ్యి జారిపోయిందక్కా.

సీత : (వెంకులు ఏరుతూ) ఇన్నిపాట్లు పడింది యీ మందు కోసమే. ఒక్కబొట్టుకూడ మిగల్లేదు.

సత్యం : పంతులుగార్ని చూసి భయపడినట్లున్నాడు.

పంతు : ఏరా రంగా ! ఏం పని చేశావ్ ?

సీత : యింకా ఎందుకులెండి ? మీడబ్బు మీకు ముట్టిందిగా, యింక వెళ్ళండి.

పంతు : వెళతాను; కాని రంగడింక నాకొట్టుదగ్గరకు రానడానికి వీల్లేదు.

సీత : పంతులుగారూ ! యీ పని మీకు ధర్మంగా లేదు. ఈ కష్టకాలంలో మీరుకూడా వాడికి నౌకరీ లేకుండా చేస్తే నేం బతకలేం. నేము చావడమే మీ దేశ భక్తికి ఆధారమైతే వాడికి నౌకరీ తీసేయండి. పేదవాళ్ళను మరీ

మాడ్చి చంపటమే మీ కిష్టమయితే వాడిని రావద్దనండి.

పంతు: సరే! సైకిలుమాత్రం యిక యివ్వను. నడిచి పేపర్లమ్ముకునే పూటైతే రానవ్చు.

[పంతులు వెడతాడు.]

సీత: నీకు బుద్ధిలేదురా? అలాంటి వెధవపని చేసి నాన్నకోసం పదిరూపాయలు తీసుకొస్తావ్రా? ఆడబ్బుతో నాన్న ఆరోగ్యవంతుడైతే మాత్రం, యిలా జరిగిందని తెలిసిం తర్వాత బతకడానికి యిష్టపడతాడా? "పదిరూపాయలు తెస్తా నన్నయ్యా" అని వెధవ కబుర్లు చెప్పడం ఈ దొంగతనం చేయడానికేనా?

రంగ: నేను దొంగతనం చేయలేదు.

సీత: ఈ చేసినపని?

రంగ: దొంగతనం కాదు.

సీత: నోర్మూయ్. (దనడమీాద కొడుతుంది)

సత్యం: సీతా వాడు నీగురించి చేయలేదు. ఈ పనికి దొంగతనమని పేరు పెడతారని తెలిసినవాడు చెయ్యలేదు. ప్రపంచంలో డబ్బును కాపాడ్డంకోసం పెట్టిననియమాలు వాడి చిన్న మెదడుకు ఇంకా అర్థంకాలేదు.

సీత: (కళ్ళనీళ్ళతో) రంగా! ఎప్పుడూ కొట్టలేదు. పొరపాటున చెయి జారింది.

రంగ: (ఏడుస్తూ) అక్కా! కొట్టినందుకు బాధపడలేదు. నేను దొంగతనం చేయలేదు. బిందె పట్టుకొని తాకట్టుకోసం యిల్లిల్లూ తిరిగేను ఎవ్వరూ యివ్వలేదు నీకు తెలుసు.

యీ సైకిలన్నా పెడితే యిస్తారేమోనని సైకిల్‌షాపు దగ్గరకు వెళ్ళాను. నాలుగు రోజులువాయిదా పెట్టి వాళ్లిచ్చారు. యిక యిలాంటిపని ఎప్పుడూ చేయనక్కా (మందుకేసి చూస్తూ) యింతా తెచ్చినమందు నేలపాలు చేశాను.

సత్యం : పరవాలేదు. శంకరంగారితో చేయి జారిందని చెప్పి మందు తీసుకురా.

రంగ : మళ్ళీ యిస్తాడా?

సత్యం : యిస్తాడు. లేకపోతే నేను వస్తానని చెప్పు.

రంగ : ఔను; నువ్వంటేభయం తప్పకుండా యిస్తాడు. అక్కా మందు పట్టుకొస్తాను, మరొక సీసా వుందా?

[సీత లోపలకు వెడుతుంది.]

రంగ : అక్క చాలామంచిది. మూడురోజులనుంచీ అక్కకు అన్నం లేదు. అన్నయ్యకూడా తిండిలేదు.

సత్యం : నువ్వు?

రంగ : నేను రాత్రి కొంచం తిన్నాను,

[సీత సీసా తీసుకవస్తుంది.]

రంగ : నీరసంగా ఉందాఅక్కా?

సీత : లేదు.

రంగ : నన్ను కొట్టినందుకు బాధపడుతున్నావా?

సీత : అదీకాదు.

రంగ : నాన్నకోసమా?

సీత; అబ్బ నన్ను ఊరికే వాగించకు వెళ్ళు రంగా.

[రంగడు సీసా తీసుకు వెళ్తాడు.]

సత్యం: ఏమిటాలోచిస్తున్నావ్?

సీత: ఏమీలేదు.

సత్యం: నేను తెచ్చిన డబ్బును గురించా?

సీత: ఎందుకు ఆత్మస్తుతి! చాలా గొప్పపని చేశావుగా?

సత్యం: పంతులు కిచ్చాననా?

సీత: పంతులు కిచ్చినందుక్కాదు. అసలు ఎందుకు తీసుకొచ్చావు డబ్బు...నిన్నెవరు తీసుకురమ్మన్నారు?

సత్యం: (నవ్వుతాడు)

సీత: ఎందుకు నవ్వుతావ్?

సత్యం: యిది సంతోషంతో నవ్వుకాదు; వాడిపోయిన నవ్వు.

సీత: కవిత్వం చెప్పకు.

సత్యం: నిజం; సీతా! తేవలసినంతా తేలేకపోయాను. తెచ్చింది కూడా దుర్వినియోగం అయిపోయింది.

సీత: ఎందుకు తీసుకురావాలని నేనడుగుతున్నాను?

సత్యం: చన్నీళ్ళకు వేడినీళ్ళు సాయంగా మీ కష్టానికి కొంత ఆదుకోవాలని.

సీత: ఆ అవుసరం నీకెందుకు?

సత్యం: కొత్తగా మాట్లాడుతున్నావ్.

సీత: లేదు.

సత్యం: ఇది వరకెప్పుడూ అనలేదే?

సీత యిదివరకు కూడా తీసుకొచ్చావని మరోసారి చెబుతున్నానన్న మాట.

సత్యం : సీతా !

సీత : ఔను...సత్యం ! మేము సగం చచ్చి బ్రతుకుతున్నాం, నీసహాయం మమ్మల్ని పూర్తిగా చంపుతుంది. నువ్వు నన్ను బ్రతికుండగానే చంపాలంటే నువ్వు చచ్చిచెడి, అందుగురించి కొందర్ని బాధ పెట్టి డబ్బు తీసుకురా.

సత్యం : సీతా ! కష్టపడేవాళ్ళకు సహాయపడ్డం కనీస మానవ ధర్మం. ఆ ఉద్దేశ్యంతోనే నేను...

సీత : తనకు మాలిన ధర్మం చేస్తున్నావ్.

సత్యం : నేను ఎక్కువ కష్టపడి యీడబ్బు తెస్తున్నట్లుగా భావించి నువ్వు బాధపడుతున్నావ్.

సీత : కాదు.

సత్యం : కావచ్చుకాని: ఒకరోజుకు మించి మాకుటుంబం ఎప్పుడూ పస్తు పడలేదు...రెండు మూడు రోజులు వరుసగా తిండి లేకుండా మాడిపోయే వాళ్ళను గురించి ఒకరోజు ఉపవాసం చేయడంకూడా పెద్ద బాధైన పనికాదు. ఆ పది రూపాయలూ మీ తిండికోసం వుపయోగ పడతాయని తెచ్చాను.

[చలపతి వస్తాడు]

చల : నేను రావడంవల్ల మీకుఏమీ అభ్యంతరం లేదుకదా !

సీత : చలపతిగారూ ! కూర్చోండి.

చల: కూర్చోడానికి రాలేదు. పాపం మీనాన్నను ఒక్కసారి చూచి వెడదామని వచ్చాను.

సత్యం: ఎంతకాలానికి పాపం రామయ్యమీద దయకలిగింది.

చల: ఎవరూ? హైలర్ సత్యమా! ఏమిటోయ్ నీగురించి వూరంతా చెప్పుకుంటున్నారు.

సత్యం: అల్లరి వాడిననా?

చల: ఎంతమాట. చాలా తెలివైన వాడవని చెబుతారు. ఉపన్యాసాలుకూడా దంచేస్తావట.

సత్యం: కష్టపడి జీవించేవాళ్ళ ఉపన్యాసాలకూ, విలువేముందీ రోజుల్లో. వాళ్ళు బ్రతికి జీవించటల్లేదిప్పుడు.

చల: యిప్పుడు చచ్చిపోయిన వాళ్లెవరు?

సత్యం: స్వతంత్ర భావాలుకల ప్రతి మానవుడుకూడా.

చల: స్వతంత్రం వచ్చాకకూడా చాలా తీవ్రంగా మాట్లాడుతున్నావే?

సత్యం: ఏదో తమలాంటివారికి ఈ స్వతంత్రం మంచి అవకాశమే యిచ్చింది.

చల: నేనుకూడా ఒక చోట నీలాంటి నౌకర్నేగా నా కవకాశ మొచ్చేదేమిటి?

సత్యం: రంగనాథంగారికి మీరు జనరల్ మేనేజరు.

చల: అయితే.

సత్యం: మీరే రంగనాథం, రంగనాథనేమీరు: మీరు చెప్పినట్లు ఆయన చేయవలసిందే. అసలు చేసేదంతామీరే. నామ్‌కే వాస్తే ఆయన.

చల: ఏమిటో అంతా అలా అనుకుంటారు. (సీతతో) ఏలా వుందమ్మాయ్ ?

సీత: లోపలకు వచ్చి చూడండి.

చల: అసలు ఏమన్నా మాట్లాడేనా ?

సీత: మాటపడిపోయి వారం రోజులయిందండి.

చల: అరె ! పాపం ! కూర్చోవడంగాని లేవడంగాని ?

సీత: ఏమీ లేదు.

చల: ఆహారంకూడా.

సత్యం: మీ దయవల్ల అతనికేకాదు...యింట్లోవాళ్ళకుకూడా వారం రోజులనుంచీ దాని దర్శనమే దొరకటంలేదు.

చల: ఎంతమాట...సూర్యం నాకీవిషయంలో చెప్పనేలేదే ?

సీత: మీతో చెప్పానన్నాడే ?

సత్యం: బహుశా, మర్చిపోతూ ఉండొచ్చు.

చల: ఆ...ఒక్కపనా నల్లకాడా. నెల్లాళ్ళనుంచి యిక్కడికి వద్దామని ప్రయత్నం ఈ రోజుకు తీరెక్కలిగింది.

సత్యం: ఔను పాపం !

చల: (కోపంగాచూసి) వెళతాను సీతా !

సీత: (సత్యంతో ఏమీ అనొద్దని సౌంజ్ఞచేసి) కూర్చోండి.

సత్యం: నేనే వెళతానండి (వెళతాడు)

చల: పాపం ! యితను చాలా అమాయకంగా కనిపిస్తాడే, మీ కేమన్నా...

సీత: కావలసినవాడే దూరపుబంధువు.

చల : పాపం మంచివాడే అనుకో. ఆ మంచితనం తెలియని వాళ్ళదగ్గర చాలా చెడ్డగా తయారవుతుంది. రంగడేడి ?

సీత : నాన్న మందు కోసమెళ్లాడు.

చల : పాపం మీ అన్నయ్యను చూస్తే నాకు జాలేస్తుంది.

సీత : ఏదో ఆల్టైలెన్సు తెప్పించండి.

చల : నా చేతిలో వుంటే యింతవరకూనా, అయినా ఓవర్ లోడ్ చేయమని ఎవరు చెప్పారు ?

సీత : మీరే చెప్పారటగా ?

చల : యిదొకటా పైగా ! పాపం ఏదో కండక్టరూ, డ్రైవరూ, పై డబ్బులుకోసం పాటుపడ్డం...శృతిమించి వస్తే అదిగో చలపతిగారు చేయించారనడం, అయినా సీతా! సూర్యం అంత కోపిష్టిమనిషేమిటే? నామీద కేకలువేశాడు. నేను మాట్లాడకుండా వూరుకున్నాను. నేను శాంతాన్ని జాగ్రత్తగా కాపాడుకునే మనిషిని. ఆ మాటలు రంగ నాధంగారి దగ్గర సాగుతాయా ?

సీత : రంగనాధంగార్ని మా అన్నయ్య ఏమన్నా అన్నాడా ?

చల : ఏంజరిగిందో ఏమొ ? ఒకపావుగంట క్రితమే పాపం సూర్యాన్ని పనిలోంచి బర్తరఫ్ చేయమని కబురు పెట్టారు. ఆయన మాటంటే శిలాశాసనం, ఆయన ఉప్పూ, పులుసూ తింటున్నాం. అయినా కల్ప వృక్షాన్ని దగ్గర పెట్టుకొని మరీ కష్టాలు పడుతున్నారంటే పాపం చాలా విచారించవలసిందే ! మీ నాన్న రామయ్య అంటే ఆయనకు ఎంతో అభిమానం...అందుకేగా నా

సిఫార్సు అక్కర్లేకుండానే సూర్యానికి ఉద్యోగం దొరికింది.

సీత: మీరేదో విధంగా చెప్పి ఉద్యోగాన్ని నిలబెట్టండి.

చల: నా సంగతి చాలా తక్కువ తెలుసు...నా చేతికిందుగా ఈ నాడు నాలుగు వందలమంది పనివాళ్ళు బ్రతుకుతున్నారు. కాని చలపతి కఠినుడని ఏ ఒక్కడూ అనలేదు. ఇదిగో అమ్మాయి, నువ్వు రంగనాథంగార్ని ఎప్పుడైనా చూశావా?

సీత: చిన్నప్పుడొకసారి వాళ్ళింటికి వెళ్ళాను. అప్పుడు చూచిన జ్ఞాపకం.

చల: అదీ...ఆయన హృదయంలో ముద్రపడిపోయావ్.

సీత: ఆఁ...

చల: అబ్బే! ఏదైనా మీనాన్న ప్రస్తావన వచ్చినప్పుడు సీత వుంది, బావుందా! యిదీ ప్రశ్న...ఏమిటో నువ్వంటే రంగనాథంగార్కి ఆప్రేమా, ఆదయ...అరె! ఆయన సున్నితమైన నోటితో దేవుణ్ణి తలచడానికి కూడా సిగ్గుపడతాడు. మనిషిది ఎంత అందమైన విగ్రహం. మాట ఏదో మువ్వలమోతకింద వుంటుంది. అనేకమంది ఆయన దర్శనంకోసం ఈ నాటివరకూ తహతహలాడుతారు.

సీత: ఎందుకు చెబుతున్నారిదంతా?

చల: పాపం పసిదానవు నీకేం తెలుస్తుంది.

సీత: తెలియాల్సిందేమిటి?

చల: ఆయన తత్వాం.

సీత : నాకు ఆ అవుసరమేమీ కనుపించదే!

చల : మీ అవస్థలే ఆ అవుసరాన్ని కలిపిస్తాయేమో

సీత : నన్నేం చేయమంటారు ?

చల : నువ్వు ఏదీ చేయి చేయకపో, నాకదంతా అనవుసరం. మీ కష్టాలు తీరాలంటే ఒక్కసారి రంగనాథగార్ని చూడటం మంచిదంటాను. దేవుడిక్కూడా దర్శనమిస్తాడు. నీ గురించి ద్వారాలన్నీ తెరుస్తాడు.

సీత : మాకు మాత్రం.

[రంగడు మంకుతో వస్తాడు.]

చల : ఏలా కనుపిస్తారనా సందేహం నేనున్నానుగా.

రంగ : చలపతిగారా ! పాపం !

చల : వెళతానమ్మాయి.

సీత : మంచిదండీ...కాని మాఅన్నయ్య పనిగురించి

చల : నేను చెప్పిందే మంత్రం.

సీత : నేను వెళ్ళలేనండి

చల : పాపం ! పిచ్చిమనస్సు.

రంగ : ఎక్కడికక్కా ?

సీత : రంగనాథంగారితో మాట్లాడటానికి.

రంగ : ఎవరెళ్ళమన్నారు ?

చల : నువ్వక్కడకు వెళ్లానంటే అన్నయ్య ప్రాణం తీసేస్తాడు.

సీత ? ఏం ?

చల : కుర్రతనం పాపం !

రంగ : పాపం ! మీది పెద్దతనం.

చల : ఏం. వెళ్ళే?

రంగ : పొగరబోతు.

చల : తెలివితక్కువగా మాట్లాడు తున్నావ్.

రంగ : ముండలముఠాకోరు.

చల : (కోపంగా) రంగా !

[రంగడు లోపలకు వెళతాడు]

సీత : చలపతిగారూ !

చల : యిది కోపంకాదు...నాకు కోపంలేనే లేదు...బిగ్గరగా అన్నానంతే పాపం ! డబ్బుకలవాళ్ళు మంచివాళ్ళయినా, చెడ్డగానే అనుకుంటుందిగా ప్రపంచం. (వెడతాడు)

[లోపల నుంచి రంగడు "అక్కా" అని పిలుస్తాడు]

సీత : ఏం? (లోపలకు వెళుతుంది)

[లోపలనుంచి రంగ, సీతా, నాన్నా! నాన్నా! అని అంటారు. రంగడు కళ్లునులుపుకుంటూ వచ్చి బల్లమీద కూర్చుంటాడు. సీత నెమ్మదిగా వస్తుంది]

సీత : రంగా ! మళ్ళీ ఒకసారి వెళ్ళి శంకరంగార్ని తీసుకురా,

రంగ : వస్తాడంటావా అక్కా ?

సీత : వస్తాడురంగా - రాకపోతే కాళ్ళుపట్టుకొని బ్రతిమాలు. ఆపద కాలంలో ఏదన్నా చేయాలి. వెళ్ళు.

రంగ : ఏమని చెప్పి తీసుకురానూ ?

సీత : ఏమని చెబుతావ్ ? చూస్తున్న కళ్ళుమూసుకుపోయినాయని చెప్పు...కంఠంలో కఫం ఎదురు తిరిగిందనిచెప్పు...

కాళ్ళూ, చేతులూ, చల్లబడ్డాయని చెప్పు. యిక బ్రతుకడేమోనని చెప్పు.

[సత్యంవచ్చి లోపలకు వెళ్తాడు]

రంగ: (ఏడుస్తూ) అక్కా!

సీత: వెళ్ళురంగా.

[రంగడు వెడతాడు, సత్యం లోపలనుంచి వస్తాడు]

సీత: ఎలావుంది సత్యం?

సత్యం: చచ్చేవరకూ ఏం భయంలేదు.

సీత: అవేం మాటలు.

సత్యం: ఔను సీతా! ఈ కరువురోజుల్లో యింకా అతను బ్రతకాలని కోరుకోవడం దేనికి?

సీత: అన్నయ్య ఎక్కడికెళ్ళాడో యింకా రాలేదు. మతిపోయినట్లు తిరుగుతున్నాడు...ఎటుతిరిగి ఏం చేస్తాడోనని భయంగా వుంది.

సత్యం: ఏం చేస్తాడు?

సీత: ప్రాణానికి తెగిస్తాడేమో!

సత్యం: మిమ్మలనందర్నీ విడచి ఆపని చేయలేడేమో లే.

[సూర్యం వెలుపలినుంచి వస్తాడు]

సీత: అన్నయ్యా! నాన్నకు బాగా ఎక్కువగావుంది చూడు.

[సూర్యం మాటలాడడు]

సీత: అన్నయ్యా!

సూర్యం : ఈ నరకబాధ నేను పడలేను...చూసి మాత్రం ఏం చేస్తాను, చేతిలో కానీలేని చేతకాని వెధవనైపోయాను.
సత్యం : ఆడదాని కన్నా అన్యాయంగా తయారయ్యావ్.
సూర్యం : అబ్బ ! కబుర్లు చెప్పకరా. నా స్థానంలో నువ్వుంటే అలా చెప్పలేవురా ! చెల్లాయ్.

[సీత, సూర్యం, లోపలకు వెళతారు. పిచ్చయ్యతాత వస్తాడు.]

పిచ్చి : రామయ్యకేలావుంది బాబూ ! రంగడేమిటో కంగారుగా పరుగెత్తుకు వెళ్తున్నాడు.
సత్యం : కాస్త ఎక్కువగానే ఉంది.
పిచ్చి : పాపం ! బతికి చెడ్డోడు.
సత్యం : పదిరూపాయలు అప్పు తెచ్చి పెడతావా తాతా ?
పిచ్చి : నీకా ! అయ్యో. బతికి చెడ్డోణ్ణి ఏడిపించటానికి గాకపోతే నాదగ్గర డబ్బెక్కడిది బాబూ.
సత్యం : వడ్డీలకు తిప్పుతున్నావటగా ?
పిచ్చి : ఎవరు చెప్పారు ?
సత్యం : చెప్పినాళ్ళు ఎవరైతేనేం ? నేనెగేస్తానని భయమా ?
పిచ్చి : అయ్యో ! రామ. పెమాణకంగా ఆ అనుమానం లేదబ్బాయా. అయినా నాదగ్గరెక్కడిదీ ? ఎవరన్నా ఏదన్నా వస్తువుమీద డబ్బిమ్మని యిస్తారు, వస్తువ లేందే ఎవరిస్తారబ్బాయా.
సత్యం : చేబదులుగా యివ్వలేవూ ?
పిచ్చి : నాసొమ్ముకాదుగా. బతికి చెడ్డోడిచేత ఎందుకబ్బాయా లేదని పిస్తావ్.

సత్యం : యిదిగో పిచ్చియ్యతాతా! నేను మంచిగా అడుగుతున్నాను యిస్తావా, యియ్యవా?

పిచ్చి : యిదేంటబ్బాయో, కోనంగా అడుగుతున్నావ్.

సత్యం : (దగ్గరగా వస్తాడు) పిచ్చియ్యతాతా! రామయ్య నీ స్నేహితుడు. రామయ్య బిడ్డలువీళ్ళు...వాళ్ళకు రెండు రోజులనుంచీ భోజనంలేదు. యింకో రోజుగడిస్తే వాళ్ళు మనతో మాట్లాడలేరు. పదిరూపాయలివ్వు. నన్ను హామీగా పెట్టుకో. వారంరోజుల్లో నీ రుణాన్ని తీరుస్తాను.

పిచ్చి : నాదగ్గరెక్కడిదబ్బాయ్ వత్తాను.

[పోబోతాడు. సత్యం పట్టుకుంటాడు]

సత్యం : ఆగు!

పిచ్చి : సత్తెమా!

సత్యం : అంత భయపడతావేమిటి?

పిచ్చి : ఔటోణ్ణి నన్నేం చేయకు బాబూ.

సత్యం : (ఉంగరంతీస్తూ) పిచ్చియ్యతాతా! వస్తువు మీాద యిస్తావుగా!

పిచ్చి : బతికిచెడ్డోణ్ణి నా సంగతి నీకు తెలుసు. నా దగ్గరెక్కడుంటాది బాబూ...ఎవరినన్నా అడుగుతాను.

సత్యం : ఈ వుంగరం తీసుకపోయి పదిరూపాయలు పట్టుకురా.

పిచ్చి : (ఉంగరం తీసుకుని చూస్తుంటాడు)

సత్యం : వడ్డీఎంత?

పిచ్చి: రూపాయకు అణా తీసుకుంటారు.
సత్యం: వెళ్ళి పట్టుకురా.
పిచ్చి: (ఉంగరం చూస్తూంటాడు)
సత్యం: ఏమిటాలో చిస్తున్నావ్?
పిచ్చి: (వులిక్కిపడి) ఎల్తాను.
సత్యం: పిచ్చియ్యతాతా!
పిచ్చి: ఆఁ
సత్యం: ఆ ఉంగరం యిలాతే.
పిచ్చి: ఏం?
సత్యం: పదిరూపాయలు అప్పుపెట్టడానికి నా మీదనీకు నమ్మకం లేకపోతే ఈ ఉంగరం నీకెలాయిస్తాను?
పిచ్చి: బాగుందబ్బాయో! అవసరాన్నిబట్టి అడిగావు — వస్తువు లేందే వాళ్లెలాగిస్తారు. (ఉంగరం యిస్తాడు)
సత్యం: యిదేం ఉంగరం?
పిచ్చి: బంగారానిదికాదా?
సత్యం: గిల్టుంగరం.
పిచ్చి: నాకొంప ముంచేద్దువన్నమాట.
సత్యం: వందో, వేయో వెనకేసుకుని పెట్టుబడీదార్ల లక్షణాలు నేర్చుకుని పేదవాళ్ళను ఏడిపించే మీలాంటి వైషపు కొంపముంచడమేకాదు. నాశనంచేయాలి.
పిచ్చి: సత్తెమా!
సత్యం: (చొక్కాపట్టుకుని) వెళ్ళి పట్టుకురా. ఇవ్వకపోవా నీ మాట దక్కదు.

పిచ్చి : (వెర్రిగా) వాబోయ్ ! [సీత వస్తుంది]

సీత : సత్యం !

పిచ్చి : చూడు సీతమ్మా !

సత్యం : మాట్లాడకు ముందువెళ్లు......అయిదు నిమిషాల్లో రావాలి వెళ్ళవేం.

పిచ్చి : వెళతాను.

సత్యం : నువ్వొంటనే రాకపోతే మళ్ళీ మీ యింటికి వస్తాను.

పిచ్చి : ఏదో తంటాలు పడతాను. మరి లేకపోతే ?

సత్యం : నీ పెట్టె బద్దలకొడతాను.

పిచ్చి : వద్దు పట్టుకొస్తాను. (వెళతాడు)

సీత : సత్యం ! పలుగూ, పారా పట్టుకురానా ?

సత్యం : ఎందుకూ ?

సీత . బాగున్నవాళ్ళ యిళ్ళన్నీ కన్నమేద్దాం.

సత్యం : దానికి నేర్పు అక్కర్లేదూ ?

సీత : దానికి నేర్పేముంది. కన్నంవేసేప్పుడు అలికిడి విని ఎవరన్నావస్తే పలుగుఎత్తి పొడవటమే.

సత్యం : ప్రాణంపోదూ ?

సీత : ప్రాణంపోయినా మనకు కావలసింది డబ్బేగా. పిచ్చయ్యతాతకన్నా, నీకు లోకువగా ఎవరూ దొరకలా ! వెర్రివాణ్ణిచేసి ఆ విధంగా డబాయిస్తావూ? ఎంతో తెలుసునను కున్ననువ్వే ఈ విధంగా పొరబడితే, అన్నయ్య ఏదైనా చెయ్యగలుగు తాడుగా.

సత్యం : దొరకగూడా తెలివితక్కువ వాడైతే, దొంగవుతాడు,

దొంగ తెలివైనవాడైతే, దొరవుతాడు. నా కెందుకులే ఈ యాతనంతా.

[రంగడొస్తాడు]

రంగ: అక్కా! శంకరంగారొస్తున్నారు.

శంక: ఎందుకు కబురుపెట్టారు? ఏమిటీకంగారు.

సీత: మీరిచ్చినమందు అలాగే ఉండిపోయింది.

శంక: ఎం త్రాగలేదూ?

సీత: ఏలా త్రాగించను? నోట్లోవేసింది గుటక వేయడల్లేదు. గురక ఒకటి ప్రారంభించింది.

[శంకరం, సీతా లోపలకు వెడతారు.]

సత్యం: ఏరా రంగా! పేపర్లన్నీ వేళ కావడల్లేదు.

రంగ: అవుతోంది.

సత్యం: మరి యింకా యిక్కడేవున్నావేం?

రంగ: సైకిలులేనిదే ఎంతమందికి అందజేసును.

సత్యం: చేసినపనికి సైకిల్ లేకపోవడమే శిక్ష. వెళ్లు. మళ్ళీ ఆలశ్యమయిందంటే ఈ నౌకరీకూడా వుండదు.

[సూర్యం లోపల నుంచి వస్తాడు]

సూర్యం: పదిరూపాయలేంచేశావ్?

రంగ: శంకరంగారికిచ్చాను.

సూర్యం: ఎక్కడతెచ్చావ్ పదిరూపాయలు?

[రంగడు లోపలకు వెళతాడు]

సత్యం: భయపడేవాణ్ణి యింకా బాధ పెట్టడమెందుకు?

సూర్యం : ఎందుకూ భయపడటం?
సత్యం : సైకిలు తాకట్టుపెట్టినందుకు? నీకీవిషయం తెలీదేమిటి?
సూర్యం : తెలిసింది.

[రంగడు లోపనుంచి పేపర్లుతీసుకవచ్చి వెళ్ళిపోతాడు.]

సూర్యం : రంగా!
రంగ : (ఆగిపోతాడు)
సూర్యం : ఆపని చేయమని నీ కెవర్రా చెప్పింది?
సత్యం : మీ నాన్నరోగం చెప్పింది.
రంగ : అవును.
సూర్యం : ఏడిశావు. యిక అలాంటిపనిచేశావంటే...
రంగ : గట్టిగాతన్ను. బుద్ధొచ్చిందన్నానుగా, ఆక లేస్తుంటే అన్నం పెట్టలేదుగాని అక్కడకూడా ఒక లెంపకాయ వేసింది. పైగా ఈ రోజు సైకిలుకూడా లేదు. ఏలాగమ్మోలో నాకే తెలియటల్లేదు.
సత్యం : వెళ్లు రంగా!

[రంగడు వెళతాడు. శంకరం, సీత వస్తారు]

శంక : ఈ టైంలో ఏవిధంగానూ వెనకాడ్డానికి వీల్లేదు. చింతామణి తప్పకుండా వాడాల్సిందే. తమలపాకు రసంలోకాస్త కుప్పి అరగతీసి నాలుక్కి రాశామంటే తకాలున గుణం కనిపించాల్సిందే.
సీత : మరీ.....
శంక : ప్రస్తుతం ఒకమోతాదు వేరేమందు వేశానులే. గురక కాస్త తగ్గికాస్తతేలిక రావచ్చును...కాని చింతామణి

వాడ్డమంటే మాటల్లో పనికాదన్నమాయి.

సత్యం: భవానీశంకరుణ్ణీ, బిల్వమంగుళ్ళనే ఆరిపేసింది.

శంక: ఏ చింతామణని నీ ఉద్దేశ్యం?

సత్యం: కాళ్ళకూరివారి చింతామణికదూ?

శంక: (హేళనగా) చింతామణి అంటే నాటకం అట...ఆయుర్వేదం తెలియని ప్రతివాడూ ఆయుర్వేదాన్ని విమర్శించడమే.

సత్యం: యిది నాటకం గాకపోతే ఏమిటండీ. అవసానకాలంవచ్చి ఆయనకు గురక ప్రారంభిస్తే చింతాణివేస్తే తకాలున గుణం కనిపిస్తుందంటారేమిటి? ఒక్కసారి కళ్ళు తెరిచి కళ్లు మూస్తాడా. దానివల్ల ఫలితం...యిదిగో ఓ బిషగ్వారా! నేను చెబుతున్నాను. వాళ్ళదగ్గర చిల్లికానీకూడా... మీ చింతామణులూ, మీ చంద్రోదయాలూ, డబ్బు కోరకుండా యిచ్చే పక్షంలో అయితే నిక్షేపంగా వాడండి. ...ఏదో ఈ బాధలో డబ్బుందుకోవాలని మనస్సులో పెట్టుకొని పైకి నాటక మాడితే ఫలితం లేదని చెబుతున్నాను. ఏమంటారు?

శంక: డబ్బు లేనిదే వైద్యం చేయడం మాచేతకాదు.

సత్యం: అయితే పెందరాడే దయచేయండి.

శంక: ఏం సీతా!యిందుకేనా రప్పించింది.

సీత: ఏమిటి సత్యం! యిది మర్యాదాగా వుందా?

సత్యం: అబ్బే! ఎందుకుంటుంది? ఏమన్నా పదులూ, పాతికలూ వుంటే అర్పించుకోండి, నా కెందుకు?

శంక: నువ్వున్నావంటే నేనసలే రాకపోయేవాణ్ణి.

సత్యం: ఔను, నిజం చెప్పేవాడంటే మీకేగాదు, ప్రపంచానికే బాధ.

సూర్యం: శంకరంగారూ! చింతామణి వాడండి.

శంక: చింతామణివాడ్డమంటే మహామహాలక్ష్మాధికార్లే వెనకడుగు వేస్తారు.

సూర్యం - ఎందుకూ?

సత్యం: డబ్బు ఖర్చని.

శంక: ఔను.

సూర్యం: అయితే వెళ్ళిరండి. డబ్బొందిన తర్వాత మీకు కబురు పెడతాం.

[సూర్యం లోపలకు వెడతాడు]

సత్యం: ఈ లోపుగా చావకుండా బ్రతికుంటే!

శంక: ఎవరు?

సత్యం: అబ్బే మీరుకాదు వాళ్ళనాన్న.

శంక: సీతా! చూస్తున్నావుగా!

సత్యం: ఆమె చూడటంలేదు వింటోంది.

శంక: (విసురుగా వెళ్ళిపోతాడు)

సీత: సత్యం! నీ కెన్నిసార్లు చెప్పాలి.

సత్యం: సత్యం ఎన్నిసార్లు చెప్పినా వెగటుగానే వుంటుంది. యిదిగో సీతా! నా ప్రకృతిలో ఒకపురుగుంది. అది అన్యాయమనుకునే సంగతేదయినా వుంటే, ఒక్కనిమిషం నన్ను వూరుకోనివ్వదు. వూరుకుందామనుకున్నా...తల

కాయ నేలనేసి కొట్టినంత పనిచేస్తుంది. మధ్య మధ్య నీ చేత మందలింపులనే మందులు తినడానికి యిదో పెద్ద జబ్బయి కూర్చుంది?

సీత: నీ మాటలు ఏడ్చేవాళ్ళనుకూడా నవ్విస్తాయి.

సత్యం: యింకా పిచ్చియ్యతాత రాలేదు...మినను దగ్గర పని లేదు. నేనలా వెళ్లొస్తాను.

[సత్యం నెమ్మదిగా వెస్తూవుంటగా,
సీత గుమ్మంలోకిచూసి కెవ్వన అరుస్తుంది]

సత్యం: సీతా! ఏమిటది?

సీత: (కంగారుగా) అన్నయ్యా. కైజారు

సత్యం: ఆఁ...(లోపలకు వెడతాడు)

[సూర్యంచేతిలో కైజారుంటుంది. సత్యం కైజారున్న
చేయిపట్టుకొని తీసుకవస్తాడు)

సత్యం: ఏమిటిది సూర్యం?

సూర్యం: కైజారు.

సత్యం: ఎందుకు తీశావ్?

సూర్యం: పరువు నిలబెట్టుకోడానికి. ప్రాయశ్చిత్తం చేసుకోడానికి.

సత్యం: ఏంజేస్తావ్?

సూర్యం: ప్రాణం తీసుకుంటాను.

సత్యం: ఫలితం?

సూర్యం: తరువాత విషయం నా కనవసరం.

సత్యం: ముందు చావడమే ముఖ్యమంటావ్.

సూర్యం: అవును.

సత్యం : యిట్లా చస్తే నీ ఒక్కడితోనే పోదుగా అలా బైటకు వెడదాం రా.

సూర్యం : ఎందుకూ ?

సత్యం : ప్రభుత్వం ఎదురుగా వెళ్ళి ధీరోదాత్తంగా "నేను ఆహారసమస్యా పరిష్కారంకోసం, ప్రపంచానికి బరువు తీర్చడంకోసం, ప్రాణాన్ని త్యాగం చేస్తున్నా"నని చెప్పి పబ్లిక్ రోడ్డుమీద పొడుచుకుంటే రేప్రొద్దున ఫోటోతో సహా పేపర్లో పడుతుంది.

సూర్యం : సత్యం !

సత్యం : చేతగానిపని ఎందుకుచేయబోయావ్ ?

సూర్యం : యింతకన్నా చేతనైంది నాకేం కనుపించలేదు.

సత్యం : నీ కన్నా సీతే చాలా ధైర్యమైంది.

సూర్యం : కావచ్చును. నేనందుకు ఒప్పుకుంటాను కూడా... ప్రపంచంలోవున్న ప్రతిజీవికన్నా నేను చాలా అసమర్థుడనని నాకు తెలిసినమీదటే, ఈ పనిచేయాలనుకున్నాను. మానాన్నకు చెట్టంత కొడుకుని నేను...మా చెల్లాయికి, తమ్ముడికి ఆప్యాయంగా కనుపించే విగ్రహం నాది...గతాన్ని ఆలోచిస్తే యింతవరకూ ఎలా బ్రతికానో నాకే అర్థంకావడంల్లేదు. యిప్పుడు బ్రతికి ఎదురుగా వుండి, లేని ఆశను వాళ్ళలో కల్పించేదానికన్నా, లేదని నిరాశ కల్పించడమే అవసరంగా తోచింది.

సీత : అన్నయ్యా ! ఒక్కసారి యిలాచూడు. మాగురించి నువ్వు బాధపడుతూ చచ్చిపోయేదానికన్నా...బాధకు

కారణమైన మనుష్యుల నందరినీ ముందుగా చంపడం అవసరమేమో.

సూర్యం : చెల్లాయ్ !

సీత : నువ్వాపని చేయలేనని నాకు తెలుసున్నా, తీపైన నీప్రాణం మీాదే నీకు విరక్తి గలిగితే మాప్రాణాలు తీయడంకూడా ఒకలెక్కలోనిది కాదనుకుంటాను. జబ్బుపడ్డ నాన్నకు రక్షణివ్వలేక, మమ్మల్ని నువ్వు పోషించలేక, సుఖంగా నిండుప్రాణాన్ని తీసుకోడానికి ప్రయత్నిస్తున్నావంటే, బ్రతకటానికన్నా చావే చాలా సుఖమైందిగా గుర్తించేగా, ఆపనిచేస్తున్నది ? అలాంటి సుఖమైన మార్గాన్ని ముందు మాకు నువ్వెందుకు చూపించకూడదన్నయ్యా!

సూర్యం : పొరపాటు జరిగింది చెల్లాయి యికనేను ఈ వెధవ పని చేయను.

సత్యం : (కైజారుతీసి) యిదిగో సీతా !

[తీసుకొని లోపలకు వెళుతుంది]

సత్యం : సూర్యం ! ఇలా బెంగపడితే లాభంలేదు. మరోకారు మీాద నేను ప్రయత్నిస్తా రా.

సూర్యం : ప్రయత్నించినా లాభంలేదు.

సత్యం : ఏం ?

సూర్యం : లైసెన్సు లేదుగా.

[సీత లోపలనుంచివస్తూ కళ్ళుతిరిగి టల్లమీాద పడిపోతుంది]

సూర్యం : చెల్లాయ్...చెల్లాయ్... (దగ్గరగా వెడతాడు)

సత్యం : కంగారుపడకు సూర్యం ! కళ్ళుతిరిగుంటాయి.

సూర్యం : చెల్లాయ్ !

సత్యం : (నీళ్ళుతీసుకువస్తాడు, మొగంమీద చిమ్ముతూ) తిండి లేదు. పైత్యంమొగం పడింది.

సూర్యం : సత్యం ! నేను వెడతాను.

సత్యం : ఎక్కడికి ?

సూర్యం : మాచెల్లాయికి తిండి తీసుకవస్తాను.

సత్యం : ఎక్కడ నుంచి ?

సూర్యం : ఎక్కడనుంచయినా సరే, ఏవిధంగా అయినాసరే, తీసుకు రావాలి, తీసుకొస్తాను.

సత్యం : సూర్యం !

సూర్యం: ఎవడుతింటున్నకంచమైనా సరేలాక్కొస్తాను...ఎవడు దాచుకొన్న బియ్యమైనా ఎత్తుకొస్తాను...ఏమీ కనుపించకపోతే బాగా తిన్నవాడి పొట్టచీల్చి దానిలో, అన్నమైనా తీసుకొస్తాను. (వెడతాడు)

సీత : (లేచి) అన్నయ్య ఏడి ?

సత్యం : అలా వెళ్లాడు.

సీత : అన్నయ్యా ! అన్నయ్యా ! !

సత్యం : (చేయిపట్టుకొని) కాదు. అలా వెలుపలకు వెళ్ళాడు.

సీత : కైజారు మళ్ళీ తీసుకున్నాడా ?

సత్యం : లేదు.

సీత : లేకపోయినా, ఏదోవిధంగా ప్రాణంతీసుకుంటాడు, సత్యం, ఎందుకు వెళ్ళనిచ్చావ్ ? ఎలా విడిచి పెట్టావ్ ?

సత్యం : సీతా ! కంగారుపడకు. ఏంభయంలేదు. మళ్ళీవెంటనే వచ్చేస్తాను.

సీత : ఏమో సత్యం ! నాకు చాలాభయంగావుంది. మా బాధలు ఎవరితో చెప్పుకోం...ఎవరు తీరుస్తారు ? ఉన్న వాళ్ళు మనల్ని కన్నెత్తి చూడరు. లేనివాళ్ళకు సాయం చేద్దామని వున్నా చేతిలో కానీలేదు. ప్రపంచంలో యింత నీచంగా బ్రతుకుతున్న కుటుంబం మాది ఒక్కటే నేమో ననిపిస్తుంది.

సత్యం : సీతా ! ఒక్క మీకుటుంబమేకాదు. వేలకు వేలు కుటుంబాలు...లక్షోపలక్షల సంసారాలు, ఈ రోజున ఆహారంలేక నాశనమై పోతున్నాయి.

[పిచ్చియ్య భయంగా వస్తాడు]

పిచ్చి : అయిదురూపాయలు దొరికాయబ్బాయా ! యిదిగో ! నాలుగు రోజులలో యిచ్చేపళ్ళమైతే, యిస్తానుసుమా.

సత్యం : అలాగే యిస్తాను ఏది? (తీసుకొని) సీతా ! చూశావా. ఏదో అన్నావ్. పిచ్చియ్యతాతంటే ఎంతమంచివాడను కున్నావ్.

పిచ్చి : మాయదారిమంచిలే.

సత్యం : పిచ్చియ్యతాతకు నేనంటే ఎంతో భయమనుకుంటా వేమో, అబ్బే నేనంటే చాలా దయలేకపోతే యింటికి వెళ్ళి నమ్మకంగా యిక్కడకు డబ్బుతీసుక వస్తాడా ? పిచ్చియ్యతాతా! నువ్వు యిక్కడే వుండు...హోటల్ కు వెళ్ళి సీతకు అన్నం తీసుకవస్తాను.

పిచ్చి : మరసిపోకబాబూ. పేదోణ్ణి. అయిదు రూపాయలూ యిచ్చేయాలి సుమా !

సత్యం : వడ్డీ?

పిచ్చి : వడ్డీ అక్కర్లేదులే. అసలి త్తేచాల్లే !

సత్యం : అసలుకూడా యివ్వననేగా నీఅదురు.

పిచ్చి : అబ్బే : లేదులే

[సత్యం వెడతాడు]

పిచ్చి : పూసెడ్డ పొగరబోతోడు బుల్లా. కొట్ట బోయూడు సుమా. అందుకనే తెచ్చాను. నీతో రహస్యం చెబుతాను. ఎవరికి చెప్పబోకు బుల్లెమ్మా. చెడిపోయిందయితేనేం నాకూతురు...దాని సల్లనిసూపు లేకపోతే నేనిల్లా బతగలనంటావా ? ఎక్కడన్నా చెప్పేవుబుల్లా బతికె చెడ్డోణ్ణి.

సీత : చెప్పనులే తాతా.

పిచ్చి : దాని వైబోగం యింతాఅంతా అంటావా బుల్లా. అది ఉన్నప్పుడు మీలాగే మేంకూడా పత్తులు మాడేవాళ్ళంగా...యిప్పుడు దాని బతుకుందీ కాలుమీద కాలేసుకూచుంటే కదలక్కరలేదు. దాని మీద ఈగవాలితే చెప్పతీసుకొట్టుమా. నౌకరీవాళ్ళను యిద్దర్ని పెట్టాడు.

సీత : కాంతానికే?

పిచ్చి : మరెవరిగురించి చెబుతున్నాను, దానికే...బతికేది నాలుగు రోజులైతేంగాక అల్లాగే బతకాలంటాను...

అద్దాల బీరువాలు...పెద్ద పందిరిమంచం, ఏనుగుబొమ్మల గదిలోకి వెళితే కళ్ళు చెదిరిపోతాయంటే నమ్ము.

సీత : నువ్వప్పుడప్పుడూ వెళుతూ వుంటావేమిటి తాతా?

పిచ్చి : గట్టిగా అనకు బుల్లా...కూతురులాంటిదానవు కాబట్టి చెప్తున్నాను. బతికిచెడ్డోణ్ణి. కడుపుతీపు చూడాలనిబమ పుట్టినప్పుడు అప్పుడప్పుడూ యెల్తాను. ఎల్లినప్పుడల్లా పాతికా పరకా చేతిలోపెడద్ది...ఏం చీరలూ. ఏం వస్తువులూ...

సీత : నాకెందుకులే తాతా, యిలాంటి కబుర్లు.

[లోపలకు వెళుతుంది. రంగడు కళ్లనులుపుకుంటూ ఏడుస్తూ వస్తాడు]

పిచ్చి : ఏం బుల్లోడా ఏడుత్తున్నావ్ ?

[సీత లోపలనుంచి వస్తుంది]

సీత : రంగా !

రంగ : పంతులుగారు కొట్టారు.

సీత : ఎందుక్కొట్టారు ?

పిచ్చి : అదుగో దవడమీద ఏళ్ళుకూడా తేలాయ్.

సీత : (దవడచూసి) ఆయన చేతులెట్లా వచ్చాయి ? బక్క వాణ్ణిచేసి యింత గట్టిగా కొడతాడా?

పిచ్చి : పొగరుమోత్తనం,

సీత : ఏం చేశావురా ? ఎందుక్కొట్టాడు ?

రంగ : సైకిలు యివ్వనన్నాడు...సైకిలులేకుండా నేను పేపర్లమ్మనన్నాను. ఎదిరిస్తావా అని దవడమీద కొట్టాడు. కళ్ళు తిరిగి పడి పోయానక్కా.

పిచ్చి : పోయేంకాలం బుల్లెమ్మా. యింటికెల్తాను. లెక్కమాట మర్చిపోకే !

సీత : సరేలే తాతా.

పిచ్చి : (వెళ్ళిపోతాడు)

రంగ ! కాసిన్ని మంచినీళ్ళియ్యక్కా.

[రంగడు బల్లమీద కూర్చుంటాడు. సీత మంచినీళ్ళు తీసుకొస్తుంది.]

రంగ : అక్కా ! నేనింక ఆపనిలోకి వెళ్ళను.

సీత : ముందు మంచినీళ్లు తాగు.

రంగ : (తీసుకొని) గూబ గుయ్యమని పోయింది. అసలు చచ్చి పోయేనేమో ననుకున్నాను. (తాగి) అన్నయ్యతో చెప్పి వాడిపని పట్టిస్తా.

సీత : కొడితే కొట్టాడులే. అన్నయ్యతో చెప్పకు.

[సూర్యం బియ్యంమూట చేతిలో బుట్టతో కంగారుగా వస్తాడు]

రంగ : అన్నయ్య తెచ్చాడు.

సీత : యినన్నీ ఎక్కడ వన్నాయి ?

రంగ : (చేతిలో బుట్టతీసుకొని) మిఠాయి భలే (ఉండలు తీసుకుంటాడు)

సూర్యం : (భయం, కంగారుగా) తెచ్చాను. ఎక్కడనుంచి తెచ్చానో ఎలా తెచ్చానో పొండి, గొడవపెట్టకండి.

రంగ : (ఉండ తీసుకోబోతాడు)

సీత : రంగా ! తినకు...ఎక్కడ తెచ్చావో చెప్పవూ !

సూర్యం : రంగనాథమింటికి వెళ్ళాను...వీధిలో అంతావున్నారు. దొడ్డివేపుకెళ్ళాను. ఎవరూ లేరు. అది వంటగది అనుకుం

టాను. బిచ్చ్యం, కూరలూ, మిఠాయి, లడ్లూ అన్నీ కనుపించాయి. ఏకో చేతికి దొరికినయ్ పట్టుకొచ్చాను. చెల్లాయ్ నువ్వు ముందుతిను...ఆకలేస్తుంది. నేనుకూడా తింటాను. రంగా! నువ్వుకూడా తిను. చెల్లాయ్! ఆలోచించకు. నన్ను ఏమీఅనకు. ఆకలి తీరిన తర్వాత ఎన్నన్నాసరే, పర్వాలేదు. యిదిగో వుండ తీసుకో.

సీత: అన్నాయ్!

సూర్యం: మాట్లాడకు. తినుచెల్లాయి. రంగా నువ్వుకూడా తిను. యిదిగో నేను పెద్దవుండ తీసుకున్నాను. ఊ...తినండి.

[సీత చేతిలోనే వుండవుంటుంది. రంగడూ, సూర్యం, మిఠాయి ఉండలునోట్లో పెట్టుకుంటారు. పోలీసు వస్తాడు అందరినోట్లోంచి ఉండలుపడిపోతాయి. వెనకాల చలపతి వస్తాడు]

చల: పట్టుకో వాడే సూర్యం.

సీత: చలపతిగారూ!

[పోలీసు వెళ్ళి పట్టుకుంటాడు. సూర్యం చేయి విదిలించు కుంటాడు]

పోలీ: రాస్కెల్ ...... కదిలితే లాటీ ప్రయోగించాల్సి వుంటుంది.

సూర్యం: ఆగు! కావాలంటే నేనే వస్తాను.

సీత: చలపతిగారూ!

రంగ: అన్నయ్యా!

పోలీ: జాగుచేయడానికి వీల్లేదు. (సూర్యం చేయి పట్టుకుంటాడు)

సీత: (ఉన్మాదంతో) చలపతిగారూ! మా అన్నయ్యను రక్షించండి.

చల : నావల్ల కాదు. రంగనాథంగారి దగ్గరకెళితే ఏమైనా సాయం చేస్తారు.

సీత : చలపతిగారూ ! మీకు జాలిలేదూ ? ఆకలితో మలమల మాడిపోయి స్పృహతప్పి పడిపోతే, యీ ఆహారం తీసుకొచ్చాడు. యిది దొంగతనం కాదు.

చల : యిది దొంగతనం కాదూ ? దానిపేరే మంటారు?

సూర్యం : యిది దొంగతనం కాదు. కాలేకడుపులు చల్లార్చుకోడానికి చేసిన పని మాత్రమే.

చల : యింటింటికీ అడుక్కోలేక పోయావా ? ఈ వెధవ పని చేయకపోతే.

సూర్యం : చలపతిగారూ !

చల : పౌరుషంకూడా దొంగ వెధవకి!

సూర్యం : మాటలు మిగులుతున్నారు. మేం దొంగలం కాదు. మేం కష్టజీవులం. కష్టానికి తగిన ప్రతిఫలం లేక పస్తులు పడుతున్నాం. మా కష్టాన్ని, మా శ్రమనూ, దోచుకు తింటున్న దొంగలు మీరు.

చల : నోర్ముయ్ !

సూర్యం : మా నాన్న జీవితాన్ని, మా నాన్న రక్తాన్ని, మా నాన్న మాంసాన్ని కాజేసి, చివరి రోజుల్లో, కానీకూడా యివ్వకుండా, కళ్ళు మూసుకుపోయి ఏడుస్తున్న మీ రంగనాథం పెద్ద దొంగ.

పోలీ : పటప్ (పోలీసు లాఠీతో డొక్కలో పొడుస్తాడు)

సూర్యం : అమ్మా !

రంగ : అన్నయ్యా !

సీత : డొక్కలో పొడుస్తావా దుర్మార్గుడా.

పోలీ : రాస్కెల్ (కాలెత్తుతాడు)

చల : పోలీస్

[చలపతి బియ్యం, బుట్ట తీసుకుంటాడు. సూర్యాన్ని పోలీసులాక్కు పోతూ వుంటాడు. రంగడు సూర్యాన్ని పట్టుకొని అన్నయ్యా! అన్నయ్యా!' అని ఏడుస్తూ వెలుపలకు వెళతాడు]

చల : పాపం ! రంగనాథంగారి దగ్గరకు వెడితే ఏమన్నా సాయం చేస్తారు.

[వికటంగా నవ్వుకుంటూ పోతాడు]

సీత : తీసుకెళ్ళి పోతున్నారా...మా అన్నయ్యను తీసుకెళ్ళి పోతున్నారా ?

[రంగడు తలమీద నెత్తురుతో విసురుగా వచ్చి 'అక్కా' అంటూ మీద వాలతాడు]

సీత : రంగా !

రంగ : లాఠీతో నెత్తిమీద కొట్టాడు.

సీత : తల చిట్లిపోయింది.

రంగ : అన్నయ్యను తీసుకెళ్ళి పోతున్నారు.

[లోపలనుంచి కవ్వున కేక వినిపిస్తుంది]

సీత : ఆఁ! ఏమిటది?

[విసురుగా యిద్దరూ లోపలకు వెళతారు. సీతలోపలనుంచి "నాన్నా, నాన్నా!" అని బిగ్గరగా ఏడుస్తుంది. సత్యం బుట్టతో అన్నం తీసుకొస్తాడు. ఏడుస్తూ రంగడొస్తాడు]

సత్యం: ఏమిటి రంగా?

రంగ: అన్నయ్యా జైలుకెళ్ళాడు (బిగ్గరగా) నాన్న చచ్చిపోయాడు.

[క్రింద పడిపోతాడు.]

సత్యం: (ఆశ్చర్యంగా, వెర్రిగా) ఆ!

[చేతిలో బుట్ట జారిపోతుంది.]

—♦ తెర జారుతుంది ♦—

అన్నా - చెల్లెలు

రెండవ రంగం

[రంగం యథాప్రకారంగానే వుంటుంది. పైలుండే స్థానంలో సరం ఎత్తివుంటుంది.

తెరలేచేసరికి పాతనాకొక్కాడుతూ, సీతలోపలనుంచి వచ్చి బల్ల దగ్గర కూర్చుంటుంది. మొగం నల్లదైన్యంగానూ, విచార పూరితంగానూ వుంటుంది. పిచ్చయ్యతాత వీధిలోంచి వస్తాడు...ఒక్కసారి పిచ్చియ్యకేసిచూసి తనపనిలో నిమగ్నమౌతుంది.]

పిచ్చి: అయిపోయింది, అప్పుడే యిరవై రోజులయింది, యింకా కళ్ళముందుగుండా రామయ్యను సూస్తున్నట్లుంది. బతికి చచ్చోళ్ళ బతుకులు యిల్లాగే తెల్లారిపోతాయ్. విచారించ కమ్మా సీతమ్మా. ఏంజేత్తాం గొడ్డున్నా, మనిషున్నా పుణాముక్కంత కాలమే!

సీత: నాన్నకు సరైన వైద్యం చేయించలేక, సరైన తిండి పెట్టలేక చంపేశాం పిచ్చయ్యతాతా.

పిచ్చి: అట్టంటవేమ్మాయ్! భూమిమీద నూకలున్నంత కర్త లున్నూ వచ్చిగాని.

సీత: కడుపునిండా తిండివుంటే యింతత్వరగా చచ్చిపోడు

నాన్న......అన్నయ్య అన్యాయంగా పైదుకెళ్ళాడు. కష్టాలు మరీ ఎక్కువయ్యాయి.

పిచ్చి: అయితే రంగణ్ణి ఏదో పనిలోకి పంపిస్తున్నావంటగా?

సీత: ఏంపని రంగనాథంగారి మిల్లులోకే వెళ్తున్నాడు.

పిచ్చి: బియ్యం మిల్లేనా?

సీత: ఔను.

పిచ్చి: పంతులుగారందుకేనేంటి, రంగడికూడా పెత్తనమిస్తానన్నారా?

సీత: ఏమన్నారు?

పిచ్చి: ఏదో లెక్కివ్వాలంట?

సీత: డబ్బా!

పిచ్చి: మరేనంట. ఎనిమిదిరూపాయలకెంతో యివ్వాలంట... ఎగేసిపోయాడని పెద్దపెద్ద కేకలేస్తున్నాడు...అలాగా బతికి చెడ్డోళ్ళ మాటనిపించుకోవడం నాకిష్టంలేకున్నా.

సీత: ఏం చెయ్యాలంటావ్?

పిచ్చి: బాకీవున్నమాట నిజమేనా?

సీత: రంగణ్ణి కనుక్కోవాలి.

పిచ్చి: కనుక్కోని బాకీవుంటే ఆడి మొగాన పడేద్దాం... అయితే బుల్లెమ్మ! సత్తెం చేసినపని చూశావా?

సీత: ఏం చేశాడు?

పిచ్చి: ఆ... ఎరగనట్టు అలా అడుగుతావేంటమ్మా... ఆ రోజున అయిదురూపాయలిచ్చాను. ఏగాణీ నాకైతే యిస్తానా? ఈనాటికి అయిదురూపాయలకి అంటు

దణాలు నాచేతిలోకి రాకపోనా, వస్తువుమీద ఎవరి కన్నా యిస్తే?

సీత : వచ్చిన తిర్వాత చెబుతాలే తాతా.

పిచ్చి : మిసనుకొట్టు దగ్గరకు అయిదుసార్లు తిరిగాను. మిసనూ బైటలేదు, మనిషీ లేడు.

సీత : ఎక్కడకెళ్ళాడు?

పిచ్చి : ఏమో!

[రంగడు మాసిన చొక్కాలతో వస్తాడు]

రంగ : రేపుగాని యివ్వనన్నారక్కా.

సీత : చలపతిగారేనా?

రంగ : చలపతిగారు కాదు. గుమస్తా నడిగాను.

సీత : పోనీ రెండు రూపాయలన్నా పట్టుకు రాలేకపోయావా?

రంగ : చేరి వారంరోజులు కాలేదు 'జీతమా' అని ఎర్రబడి చూశాడు. పేపర్లమ్ముకుంటేనే బావుండేది యిదనపని.

పిచ్చి : రంగా! మిల్లులో ఏంపని చెయ్యాలి నువ్వు?

రంగ : నామొగం పని నీకెందుకులే.

సీత : తప్పు, చెప్పరాదూ (లోనికెళుతుంది)

పిచ్చి : నేనంటే ఏలాకోళంలే యీబుల్లోడికి. బతికిచెడ్డోణ్ణి పుసుక్కునలా అనగూడదబ్బాయీ... మర నడిపిత్తావా?

రంగ : అంటే?

పిచ్చి : 'డయివరువా' అని?

రంగ : అప్పుడే డ్రయివింగొస్తాదేంటి?

పిచ్చి : మరేం పని చేత్తావ్?

రంగ : ఆయిల్ మేన్

పిచ్చి : పెద్దుద్యోగమే పేరు బాగానే వుంది. బతికి చెడినా మంచి నౌకరీయే దొరికింది.

గంగ : యేదన నౌకరీలే. ఆయిల్ మేన్. అంటే ఏమిటనుకుంటు న్నావ్? మిషన్‌లో ఆయిల్ పొయ్యడం, మిషన్లు తుడవడం యింతే.

పిచ్చి : ఓస్ యింతేనా? అయితే రంగా! మీ అన్నయ్యను చూశావా?

రంగ : చూశాను. పోలీసోళ్ళు మాటాడనివ్వలేదు.

పిచ్చి : శిక్ష ఎన్నాళ్ళేసారు?

[కంచంతో సీత వస్తుంది]

సీత : శిక్షెందుకూ, ఏం నేరం చేశాడని... నేరం లేదు కాబట్టే విచారణ లేకుండా ఖైదులో పెట్టారు. వాళ్ళిష్టమొచ్చి నంతకాలం వుంచుకుంటారు. నోరు లేనివాళ్ళిగా పేదవాళ్ళు. అడిగే దారేదుకుంటారు?

పిచ్చి : పోనీ ఒకసారి రంగనాధంగారితో చెబితే...?

సీత : తాతా! అలాటిమాటలు చెప్పకు.

పిచ్చి : యిదేంటి బుల్లెమ్మా, నీగురించి చెబుతున్నా కోపమే?

సీత . యిది తాగరా రంగా!

రంగ : రెండన్నం మెతుకులుకూడా లేవు. అంతా గంజే.

సీత : యిదైనా ఆ సుబ్బమ్మగారు పంపించారు... పిచ్చియ్య తాతా! ఒక్క శేరు బియ్యముంటే అప్పివ్వు. రంగడు జీతం తెచ్చిన తర్వాత నీ బియ్యం నీ కిస్తాను.

పిచ్చి : బతికి చెడ్డోడి చేత అబద్ధమాడించాలనిగాని... నాదగ్గ రెక్కడుంటాయమ్మా? సంపాదనా ఏమన్నానా? పొద్దున్న సోలెడు గింజలుంటే పొయ్యిమీద పెట్టుకున్నాను... బుల్లెమ్మా! సత్తెమొత్తే చెప్పమ్మా ఎల్తాను (వెడతాడు)

[రంగడు గంజి తాగుతూవుంటాడు]

రంగ : ఆపని చేయలేనక్కా

సీత : అన్నయ్య వచ్చేవరకూ ఏదోవిధంగా ఆ పని చేయిబాబూ! తరువాత మానేద్దువుగాని

[పంతులొస్తాడు]

పం॥ : ఏరా రంగా ! నీబాకీ ఎవడిస్తా డనుకున్నావురా ?

సీత : ఏం బాకీ ?

పంతు : వాణ్ణే అడుగు.

రంగ : ఎంతివ్వాలి మీకు ?

పంతు : అప్పుడే మరుపుకూడా వచ్చిందా ?

సీత : ఎంతో చెప్పండి ?

పంతు : అయిదు రూపాయలు ఓసారి తీసుకున్నాడు. అప్పు డప్పుడూ చిల్లరగా వాడుకున్నది, మూడురూపాయలు. మొత్తం ఎనిమిది.

రంగ : మీకివ్వవలసింది అయిదురూపాయలే.

పంతు : ఆ మూడు నీ బాబిస్తాడా ?

రంగ : మాబాబు డగ్గరకెళ్ళడుగు.

[సత్యం వింటూ వస్తాడు]

రంగ : సైకిలు పంచన్లు పడితే అప్పుడప్పుడూ వేయించుకొన్న బాపతు ఆ మూడురూపాయలూనూ...పైగా అది జీతంలోనిది కాదని వేరేననీ ఈయనే చెప్పాడు.

సీత : ఏమనుంది ?

పంతు : కళ్ళు మూసుకుపోయి కంచెలమీదా, ముళ్ళమీదా, సైకిలు త్రొక్కి పడేస్తే నేను బాధ్యుణ్ణా ?

సత్యం : పాతసైకిలిచ్చి సందులూ, గొందులూ తిప్పించి పేప ర్లమ్మిస్తే సైకిలు దెబ్బతింటే వాడు బాధ్యుడా ?

పంతు : సత్యం ! నీ కనవసరం.

సత్యం : అవుసరం పంతులుగారూ ! పేదవాళ్ళనుచేసి వాళ్ళకు ఆధారం ఎవ్వరూ లేరని డబాయిస్తే హృదయమున్న ఏ మానవుడూ సహించి వూరుకోడు. పంతులుగారూ ! లోగడ చెడీలని రెండు లెంపకాయలు కొట్టారే ! ఆపనే మిమ్మల్ని ఎవరన్నా చేస్తే ?

పంతు : శిక్ష చించేస్తాను.

సత్యం : కేసులు కట్టేస్తారు, శాకాలు వూదేస్తారు, పడదోసి వాళ్ళను జైల్లో వేసేస్తారు. యిదంతా ఏమిటి ? పలుకు బడి...ముందు బైటకు వెళ్ళండి. వాళ్ళన్నయ్య వాణ్ణి మీ పనిలో ప్రవేశపెట్టాడు......బాకీలు, జమలూ, ఏమన్నావుంటే అతనిద్వారా తీస్కోవలసిందేగాని...

పంతు : నిన్ను అడగటానికి మీకూ మీకూ ఏమన్నా సంబంధా యుంటే నా కక్కర్లేదు.

సత్యం : వాళ్ళడిగినా వాళ్ళిచ్చే సమాధాన మిదే.

పంతు : ఏం సీతా?

సీత : అన్నయ్యను రానివ్వండి.

రంగ : అన్నయ్య వచ్చినా ఆ మూడురూపాయలు మాత్రం యివ్వడు.

పంతు : అలవాటేగా మీకు.

సత్యం : ఏమిటి?

పంతు : పరులసొమ్ము కన్న మోహ్యపం.

సీత : జాగ్రత్తగా మాట్లాడండి పంతులుగారూ! కన్నం ఎవ రేశాడు?

సత్యం : ఆ...మీ అన్నయ్య వేశాడుగా...కడుపాకలి తీర్చుకోటానికి కన్నం. అలాంటి బహిరంగ దొంగతనమంటే ఆ పంతులుగారికి బలే కోపం లే. ఈయనీమధ్య పరిమిట్లకోసం లోపాయకారిగా ప్రయత్నం చేస్తున్నాడు. బియ్యం ఎగుమతీ, దిగుమతులన్నీ రాత్రే ఏర్పాటు చేస్తున్నాడు. యిది రహస్య వ్యాపారం. చేస్తే అలాంటివే చేయాలి. వస్తే ఒక్క సంవత్సరంలోనే, లక్షరూపాయ లొస్తాయి. దాన్ని బ్లాక్ మార్కెట్ అంటే ఆయనకు చాలా కోపం వస్తుంది. గ్రహం వక్రించి వీళ్ళపాపం పండిందంటే, మీ అన్నయ్య జైలునుండి తిరిగివస్తాడు. వాళ్లు మళ్లీ తిరిగ రారు.

పంతు : సత్యం!

సత్యం: సత్యా; సత్యా; మనుష్యులకే యిది సత్యా. వెళ్ళిరండి

పంతులు: నా డబ్బు యిస్తేనేగాని వెళ్ళను.

సత్యం: మొన్ననో పొరపాటు వచ్చావను మళ్ళీ అలాగే చేస్తారో పడద్దేమోనని చూస్తున్నాపేను. ఎంత ప్రయత్నించినా ఒక్క కానీకూడా రాదు.

పంతులు: అదే చూస్తాను. ఎలాగు రాదో చూస్తాను......సీతా! మళ్లీ వస్తానుగా. జాగ్రత్తమ్మా! వుంచకపోతే మాట దక్కదు.

[పంతులు వెళతాడు, సత్యం కూర్చుంటాడు]

సీత: వినను తీసుకెళ్ళాలట?

సత్యం: కాయకష్టం చేసేవారికి సరిగ్గాగానూ గుడిసెల్లోను...

సీత: ఏమన్నా వ్యాపారం పెట్టావా?

సత్యం: పెట్టుబడి వుండొద్దా?

సీత: మరేం చేస్తున్నారు?

సత్యం: ఉద్యోగాని ప్రయత్నం చేస్తున్నాను.

సీత: ఏమిటా ప్రయత్నం?

సత్యం: మీ అన్నయ్యను విడుదల చేయడంకోసం తిరిగాను.

సీత: ఏమన్నారు?

సత్యం: ముందు జామీను కావాలన్నారు. తీరా జామీను నే తెస్తానంటే, "నువ్వు ఎవరవు, నీకు ఏం సంబంధం లేదన్నారు"... దరఖాస్తు పెట్టమని అడిగాను. కానీ కాపీ ఒకలాగ కోర్టువాళ్ళకి అర్జీపెట్టుకొని మీ అన్నయ్యను విడుదల చేయడానికి వప్పుకోలేదు.

[శంకరం ఒక కార్డుతో వస్తాడు]

శంక: అమ్మాయి! రేపటిరోజున సత్యనారాయణ వ్రతం, ప్రత్యేకించి మిమ్మల్ని పిలువడానికని వచ్చాను.

సీత: సంతోషమండీ, అన్నయ్యగారంటే వచ్చేవాడు గాని...

రంగ: (లేస్తాడు) భోజనాలుంటే నేనొస్తానండి.

శంక: భోజనాల ఏర్పాటులేదు. నట్టి ఫలాహారంమట్టుకే యిస్తాం. తిండిదొరక్క చచ్చేరోజుల్లో భోజనాలేమిటి?

రంగ: అయితే యింటికే పంపించండి.

సీత: రంగన్ని ఆ వేళకు ఏదోవిధంగా పంపిస్తానండి. మామీద మీకున్న దయకు, మీకు ఏం ఉపకారంచేయాలో అర్థం కావటల్లేదు.

సత్యం: అందుకేగా ఆయన సత్యనారాయణవ్రతం పెట్టింది.

సీత: ఎందుకు?

సత్యం: ఈ శుభసమయంలో మీ ఉపకారబుద్ధికి ప్రతిఫలంగా ఏదో పైసారూపంలో కాస్తపడేస్తారని...శంకరంగారూ! చదివింపులున్నాయాండి.

శంక: వున్నాయి.

సీత: సత్యనారాయణ వ్రతంలో చదివింపులేమిటి?

సత్యం: చదివింపులు గురించే సత్యనారాయణ వ్రతం చేస్తారు వైశ్యులు. పరిశీలించి చూచినా దైవభక్తనే ముచ్చు వాళ్ళ హృదయం మీ దెక్కడా వుండదు.

శంక: నేను వెళతానమ్మాయి.

సీత : మంచిది.

శంక : విషయంకూడా తెలిసిందేగా ?

రంగ : ఏమిటదీ ?

సత్యం : భోజనానికి కామలే నువ్వు పడుకో.

సీత : రోగం నయంకాకుండానే నాన్న చచ్చిపోయాడు.

సత్యం : చచ్చినా బ్రతికినా ఏమక్కరాదు వెయ్యిరూపాయలు.

రంగ : శంకరంగారి మందువేయడంవల్లే మా నాన్న చచ్చిపోయాడు.

శంక : రంగా ! జాగ్రత్తగా మాట్లాడు.

రంగ : అక్కా- నేను పనిలోకి పోతున్నాను. (వెడతాడు)

సత్యం : కుర్రాడు. వాడికి జాగత్తేమిటి ? మీరు జాగ్రత్తగా ఆలోచించే ఈ శుభలేఖ యిచ్చారా ? వాళ్ళ కష్టాలను దృష్టిలో వుంచుకొనే మీరీకోరిక కోరుతున్నారా? వీళ్ళ నాన్న చచ్చిపోయాడు. వీళ్ళన్నయ్య జైల్లో వున్నాడు. వీళ్ళకు తినడానికి తిండి లేదు. ఈ పరిస్థితుల్లో మీ సత్యన్నారాయణ వ్రతానికి కట్నాలూ, కానుకలూ యిచ్చి చదివించాలా ? ఎంత ఉదారహృదయంగల డాక్టరులండీ! శంకరంగారూ ! కేప్పు చదివింపులుగా, ఏమన్నా డబ్బు వస్తే కాస్త వీళ్ళకు చదవండి. అదీ యిదీ చూడకుండా బ్రతికుంటే, ఎప్పుడో జరుకడతారు.

శంక : ఈ విషయాల్లో నీకు జోక్యంలేదు. అంతగా వాళ్ళమీద నీకు దయుంటే, వాళ్లు యివ్వవలసిన నలభైరూపాయలూ రేపు తెచ్చివడేయి.

సీత : నలభైరూపాయలా!

శంక : ఏం అంత ఆశ్చర్యపడతావ్......జ్ఞాపకం లేదూ. ఏభై రూపాయలిస్తానని వైద్యం చేయించమన్నావుగా! పది రూపాయలకన్నా ఎక్కువ ముట్టిందా నాకు?

సత్యం : ఆ పదిరూపాయలు కూడా యివ్వటమే దండుగ.

శంక : ఏం, ఎందుకూ?

సత్యం : మీళ్ళ నాన్నను చంపినందుకు?

శంక : ఏమిటీ?

సత్యం : అవునండీ...వైద్యం చేయడం ఎందుకు...రోగిని ఆరోగ్య వంతుణ్ణి చేయడమేగా — ప్రాణాపోవడం అటుంచండి, మీరు చేయిపట్టుకొని అఖండనోటికో మందువేసిన నాటి నుంచేగా మాటలేకుండా పోయింది. ఒక్కరోజైనా మీ మందుగుణం అతనిమీద కనుపించిందా? యింకా కొన్ని నెలలు బ్రతకవలసినవాడిని మీ మందులతో ప్రాణంతీసి డబ్బుకోసం వచ్చారా? ఏ మొగం పెట్టుకొచ్చారు? వెళ్ళండి.

శంక : వెళ్ళమనడానికి నువ్వెవరవు?

సత్యం : అధికారం లేకుండా డబ్బు అడగటానికి మీరెల్లా వచ్చారో, అనధికారంగా నేనూ ఆ సమాధానాన్నే యిస్తున్నాను. మీరు డబ్బడగకుండా ఎంతసేపు కూర్చున్నా నాకు యిబ్బంది లేదు.

శంక : ఎంతసేపన్నా కూర్చోడానికి నాకు యితర పనులేమీ లేవిక్కడ. ఆ పనులుండేవాళ్ళు ఎప్పుడూ యిల్లు అంటి పెట్టుకునే వుండవచ్చు. (వెడుతూ వుంటాడు)

సీత: శంకరంగారూ! మీరన్నమాటల్లో అర్థం?

శంక: పెళ్ళాడితేనే అనేమాటది యిప్పుడు తీరవలసిన పని నాది. నేను అనేమాట నా ఒక్కడి ఉద్దేశ్యంలో కూడుకున్నది కాదు. పదిమంది అనుకునే మాట.

సీత: పదిమంది ఏమనుకుంటున్నారు?

శంక: నా నోటితో నేను చెప్పలేను.....సత్యం ఏ సంబంధం లేకుండా మీయింటికి వస్తూ పోతూ వుంటాడు? ఈ ప్రశ్న ఎవరికున్నా ప్రతివాళ్ళకూ సమాధానం కూడా ప్రక్కనే వుంటుంది.

సత్యం: సమాధానం ప్రక్కనే వుంటుందీ? ఏం సమాధానముంటుంది? స్నేహాన్ని కాపాడుకోవాలని వచ్చాను. వాళ్ళ పూర్వపు స్నేహాన్ని కాపాడుకోవాలని వచ్చాను. కష్ట దశలో కాస్త పలకరించి పోవటానికి వస్తున్నాను. ఇది తప్పా? పదిమంది ఏమనుకుంటున్నారు చెప్పండి?

సీత: చెప్పనక్కర్లేదు తెలిసింది. మీరిక వెళ్ళండి శంకరంగారూ.

సత్యం: ఆగండి! పదిమందికీ నచ్చచెప్పుకోవటానికి...ప్రతి ఒక్కళ్ళ చెవిలో వరస కట్టి కొట్టుకున్నట్లు, ఊహాగానాన్ని కల్పించుకొని, అవాకు చెవాకులు పలుకుతున్నారా, మాకేం భయంలేదని చెప్పండి...వెళ్ళండి.

శంక: ఇప్పుడైతే నాకేం ఉద్యోగం కాదు......మర్యాదగా నా యత్నంగా డబ్బు జాగ్రత్త చేసి వుంచు వస్తాను.

[శంకరం కోపంగా వెళతాడు]

[సీత ఏడుస్తూ కుర్చీలో కూలబడిపోతుంది]

సత్యం: ఏం సీతా! అలా అయిపోయావేమిటి?

సీత : తెలుసుకోలేకపోయాను. ఇప్పుడు శంకరంకూడా అదే మాటన్నాడు...ఏం చెప్పను ?

సత్యం : ఏమీ చెప్పనక్కర్లేకుండానే అర్థమైపోతుంది.

సీత : ఏమని ?

సత్యం : పిరికిదానవని...వాళ్ళ మాటలు ఎందుకు లెక్కచేయాలి మనం ! నీతిని అవినీతిగా, అవినీతిని నీతిగా తారుమారు చేసే అధములు...అపవాదులు వేయడానికి అడ్డేముంది? వాళ్ళమాటలకు చెదరిపోయి అయ్యో ! మా బ్రతుకులేం కానని బెంగపడి చస్తామా ?

సీత : సత్యం !...నువ్వు మగవాడవు. నీకేం భయంలేదు.... ధైర్యంగా ఎన్నెన్నో కబుర్లు చెబుతావ్.

సత్యం : ఆడదయితే ?

సీత : బెంగపడి చావాల్సినమాట నిజమే....ఆడది అందులో వయస్సులోవున్న ఆడది, పెళ్ళికాని ఆడది. మగవాడితో మాట్లాడ్డమే కాదు, చూడ్డమే నేరం.

సత్యం : రోజులు మారాయి సీతా ?

సీత : రోజులు కొందరికి మారొచ్చు. అందరికీ మారలేదు. అందులో పేదవాళ్ళకు మారలేదు...కూటికి గతిలేని వాళ్ళకు అసలే మారలేదు. నా మాటలు విను సత్యం ! నీలో దురుద్దేశ్యంవుందని నే ననను. నువ్వు మాఅన్నయ్య వచ్చేవరకూ మా యింటికి రాకపోవడమే మంచిది.

సత్యం : "నన్ను అనుమానిస్తున్నావా ?" అని నేనడగను. నిన్ను నేను అనుమానించను. నన్ను నువ్వు అనుమానించ లేవు.

మీ అన్నయ్య వచ్చేవరకూ మిమ్మల్ని కంటికి రెప్పలా కాయడం నా ధర్మం. యిప్పుడు వెళతాను...... మళ్ళీ వస్తాను. వచ్చేదానికి నీ అభ్యంతరం వుండటానికి వీల్లేదు.

సీత : యిక రావద్దు సత్యం.

సత్యం : నేను వచ్చేదానికి నువ్వడ్డుపెట్టే అధికారం చాలా నీచమైంది. రేప్రొద్దున మీ అన్నయ్య జైలునుంచి విడుదలై "మా వాళ్ళను చూస్తున్నావా? మా యింటికి వెళ్తున్నావా?" అని అడిగితే నేనేం సమాధానం చెప్పను. సమాధానం చెప్పకుండా తలవంచుకొని నిలబడ్డానికి నేను చేసిన నేరం ఏమిటి? ఏం మాట్లాడవు సీతా?

సీత : ఏం మాట్లాడను సత్యం! నేనేం మాట్లాడలేను. ఇక నువ్వు మా యింటికి రాకపోవడమే మంచిది.

సత్యం : సరే! మిషను బేరంపెట్టాను. డబ్బువస్తుంది. నేను రాకపోయినా డబ్బు అందుకొని నీ యిబ్బందులు తీర్చుకో.

సీత : మిషను ఎందుకు బేరంపెట్టావ్?

సత్యం : డబ్బుకోసం.

సీత : డబ్బెందుకు?

సత్యం : డబ్బెందుకేమిటి? వెర్రిప్రశ్న! అవసరాలు గడుపుకోటానికి.

సీత : ఏవరవసరాలు?

సత్యం : పస్తులు పడ్డవాళ్ళు అదృష్టవంతులు. మానుమానించబడి మల మల మాడిపోయేవాళ్ళు అదృష్టవంతులు. నేను వెళ్తాను సీతా! (నిలబడే వుంటాడు)

సీత : వళ్ళీ రమ్మంటానేమో అనుకుంటున్నావా?

సత్యం : సీతా!

సీత : ఔను...నువ్వు మా యింటికెందుకు రావాలి? మా గురించి నువ్వు మిమ్మను అమ్ముకోవడం ఎందుకు జరగాలి? నీకే అభిప్రాయం లేనప్పుడు ఎందుకు చేశావ్?

సత్యం : అభిప్రాయం?

సీత : ఔను. పొద్దున్న నేను సంపాదించలేనందుకే కష్టాల్లో తిరుగుతుంటే, మిమ్మను ఎందుకమ్మావని ఎవరన్నా అడిగితే నామీద అపవాదు రావడానికే కదూ? యింతవరకూ నువ్వు చేసిన సాయానికి, నీకేమీసంగానూ ఉపకారం చేయలేనందుకు బాధపడుతున్నాను. చేయలేనేమో అని కూడా చెప్తున్నాను. యిక నీ డబ్బు నాకక్కర్లేదు, నీ సహాయం అక్కర్లేదు. నువ్వు రానక్కర్లేదు. వెళ్ళిపో.

[మంచంమీద కూలుతుంది]

సత్యం : సీతా! నేను చాలా కష్టాన్ని. నిన్న బాధపెట్టాను. నిమ్మళ్ళీమాత్రం కాదు, నీ నా హృదయంలో మనకు తెలియకుండా ఏదన్నా ఒక పెద్ద కోర్కె ఉంటే నాన్న కోర్కెగా పెట్టేసుకుంటే ఆత్మవిమర్శచేసి తప్పొప్పులగా తెలిసివేసుకోవడం మనిద్దరికీ చాలా అవసరం. అవు

త్తులో రావద్దన్నా రావాలని కోరుతుంది యిన్ని నాళ్ళ స్నేహం. వెళుతున్నా.

సీత : (ఏడుస్తూ) సత్యం !......

సత్యం : (చూడకుండా) పరీక్షకోసం పిలుస్తున్నావనే నే ననుకో లేదు. సత్యం అంత మనోనిబ్బరం లేనివాడు కాడు.

సీత : (దుఃఖంగా, చేతులు పట్టుకొని) సత్యం! అన్నయ్య ఒకనాడు ఈలాగే అన్నాడు. అప్పుడు అన్నయ్యతో అలా మాట్లాడ్డం తప్పని చెప్పాను. యిప్పుడలాగే నేను వెళ్ళిపొమ్మని చెపుతున్నాను. అప్పుడు అన్నయ్య అకారణంగా ఆవేశంలో వెళ్ళిపొమ్మన్నాడు. నేను బాగా ఆలోచించి వెళ్ళిపొమ్మంటున్నాను. నువ్వుచేసిన సహాయానికి నీ పాదాలదగ్గర తలవంచి నమస్కరిస్తాను (కాళ్ళ మీద పడుతుంది.)

సత్యం : నా కన్ను ఎప్పుడూ చెమ్మగిల్లలేదు... నేను చేసిన స్వల్ప సహాయానికి నీయీ పని నన్ను దుఃఖంతో తలవంచుకునేటట్లు చేస్తుంది. (వెళ్ళిపోతాడు)

సీత : (ఆవేదన, ఆవేశంతో బిగ్గరగా) సత్యం !

[మంచంమీద కూర్చుని ఏడుస్తూంటుంది.]

[చలపతి వస్తాడు]

చల : సీతా ! ఏడుస్తున్నావేం ? సత్యంకూడా మొగ మకో మాదిరిగా పెట్టుకొని నా కెదురయ్యాడు.....సత్యం ఏమన్నా అన్నాడా పాపం.

సీత : ఏమీ అన లేదు.

చల : పెళ్ళయిన తర్వాత తప్పనిసరి. పెళ్ళికాని ముందునుంచి కూడా.........

సీత : చలపతిగారూ !

చల : అన్నమాట్లో తప్పుందా? మీ నాయన బ్రతికుండగా నాతో చెప్పేవాడు గుర్తు. సత్యాన్ని నీకిచ్చి పెళ్ళిచేస్తానని.

సీత : ప్రతిసత్య పేదవాళ్ళను పెళ్ళిచేస్తాననేవుంది దరిద్రదేవత, యింకా పెళ్ళెందుకు...కడుపునిండి శరీరం పుష్టిగా వుండి జీవితం జరగడానికి దారుంటే పెళ్ళికావాలి, ప్రేమా కావాలి....మాకేమీ అక్కర్లేదు. మమ్మల్ని ఎవరూ అన్యాయంగా ఆడిపోసుకోవద్దు. సత్యం చాలా మంచి వాడు. సత్యం, ఏ చెడ్డ తలంపుతోనూ మా యింటికి రావడం లేదు.

చల : ఎవరేమన్నారు? ఎందుకంత ఆవేశపడ్డావ్?

సీత : ఎవరేమంటారు? ఎందుకంటారు? ఎవరేమన్నా వూరుకోను. నన్నన్నా వూరుకుంటాను. సత్యాన్నంటే సహించ లేను...సత్యం చాలా మంచివాడు. (మంచంమీద పడి పోతుంది.)

చల : సీతా! నీ మనసు చాలా చికాకుగా వున్నట్లుంది. పాపం కష్టకాలం.

సీత : మా కష్టాలకు కారణం మీరే...మా నాన్నను మాకు లేకుండా చేశారు. మా అన్నయ్యను జైల్లో పెట్టేరు.

చల : పొరబడుతున్నావ్ సీతా! నన్ను నువ్వు అర్థం చేసుకో లేదు. ఏం మీ మీద నాకేమన్నా పగా? మీ అన్నయ్య నేరంచేశాడు కాబట్టి జైలుకెళ్లాడు. రంగనాథం దగ్గర నౌకరీకాబట్టి నా నెత్తిమీద ఈ అభాండం వెయ్యడానికి పోలీసులతో నన్ను యిక్కడకు పంపించాడు. అంత మాత్రాన నేను చేసినట్లుగా నువ్వనుకోవడం మంచిదేనా?

సీత : మరి మా అన్నయ్య ఎప్పుడు విడుదలౌతాడు?

చల : ఏమో నాకేం తెలుస్తుంది?

సీత : మా అన్నయ్య ఏం తప్పుచేశాడు? కొద్దినేరానికి యింత కాలం ఖైదులో పెట్టడం ఎందుకు చెప్పండి?

చల : ఏమో అదే అర్థం కావడంలేదు......అయినా నేరానికి పెద్దాచిన్నా తారతమ్యానికన్నా, అసలు అది నేరమా కాదా అని ప్రభుత్వం ఆలోచిస్తుంది. దొంగతనమనే దాన్ని సహించి వూరుకోవడం చాలా కష్టం సీతా.

సీత : దొంగతనం...యిదీ దొంగతనమేనా? పట్టెడు మెతుకులు, ఆకలికోసం తీసుకురావడంకూడా దొంగతనమేనా?

చల : అదే! పట్టెడు మెతుకులుగాని, పుట్టెడు ధాన్యంగాని, చాటుమాటుగా ఎప్పుడు తీసుకొచ్చాడో వాడుదొంగే!

సీత : మా పరిస్థితులు కళ్లారాచూస్తున్న మీరు ఆ రంగనాథం గారితో చెపితే మా అన్నయ్యను విడుదల చేయిస్తారు.

[లేచి కాస్సేపు నిలబడి నిలువలేక కడుపు పట్టుకొని "అబ్బా" అంటూ కూర్చుంటుంది.]

చల : నువ్వే ఒక్కసారి వెళ్ళడిగితే మంచిది. నీ కోర్కె కాదన లేననుకుంటాను. పాపం! ఆకలిగా వున్నట్లుంది?

సీత : వుంది...ఎవరితో చెప్పుకోను? పది రూపాయలుంటే సర్ధండి.

చల : పది రూపాయలు; పది కానులుగూడా రంగనాధంగారి మాటలేనిదే యివ్వలేను.

సీత : మీకు జాలి లేదు.

చల : జాలివుంది...కాని ఈ విషయంలో అస్వతంత్రుణ్ణి.

సీత : మీ పిల్లాజెల్లలకూడా తిండిపెట్టడం రంగనాధంగారి ఆజ్ఞమీదే జరుగుతుందా?

చల : అవును.

సీత : పేదాబిక్కకీ మీరు ధర్మంచేయడం కూడా రంగనాధం గారి యిష్టంతోనే జరుగుతుందా?

చల : కాదని ఎలా అంటాను?

సీత : మీకు ఆలోచించుకొనే శక్తి లేదూ? మీరు మంచీ చెడ్డా గుర్తించలేరూ?

చల : నన్ను బాగా అర్థం చేసుకున్నావ్......స్వామిభక్తను, మరొకటను, ఆయనను కాదనేది చేయలేను సీతా!

సీత : ఒక మృగానికీ మీకూ తేడా ఏమిటి?

చల : సీతా!

సీత : ఒక రాక్షసుడికీ మీకూ వ్యత్యాసం ఏమిటి? మాన వులుగా వుండేవాళ్లే మమ్మల్ని పలుకరిస్తారు...మీ

రెందుకొచ్చారు ? మీలాంటి రాక్షసులకు మాయింట్లో స్థానం లేదు. వెళ్ళిపోండి.

చల : పాపం ! ఆకలికొద్దీ ఏవేవో అంటున్నావ్, ఆలోచించుకో సీతా !

సీత : ఏమిటి ఆలోచించుకునేది ?

చల : నీ బ్రతుకు తెరువు.

సీత : ఎప్పుడూ నాకిదే ఆలోచన.

చల : ఎందుకూ ఆచరణలేని ఆలోచన ?

సీత : ఈ విషయంలో మీ ఆలోచన !

చల : ముందే చెప్పాను.

సీత : రంగనాథాన్ని ఆశ్రయించమని కదూ ?

చల : నీ సుఖమైన జీవితానికి అది దారని ఊరికే చెప్పాను.

సీత : ఊరికే చెప్పారు. కోరకుండానే చెప్పారు.....దారి..... గోదారి.....చలపతిగారూ ! మంచిగా చెబుతున్నాను. ఆవలకు వెళ్ళండి.

చల : పాపం !

సీత : పాపం ! ఏమిటా పాపం ! పాపాన్ని ప్రోత్సహిస్తూ, ప్రతి నిముషం పాపాల్ని చేస్తూ, ఆ పాపాన్నే ధ్యానం చేస్తున్నారు. పాపమట, పాపం. వెళ్ళిపోండి. బైటకు వెళ్ళిపోండి. ఎదురుగావుంటే మీగుడ్లు పీకేస్తాను.

[పిచ్చియ్యతాత వస్తాడు]

చల : పిచ్చియ్యా ! చూశావా, మంచిచెప్పినా మనసు చేదు ఎదురౌస్తుంది.

పిచ్చి : బుల్లెమ్మా !

సీత : ఎవరూ చెప్పొద్దు. మీరు కూడా యింటికి రావద్దు. ఆన లకు పొండి, వెళ్ళిపొండి.

[మల్లీ మంచంమీద పడుతుంది]

చల : పిచ్చియ్యతాతా ! నా గురించి తెలుసున్న మంచి చెప్పు. ఏమిటో అనుకుంటుంది, పాపం !

[చలపతి వెళతాడు.]

[పిచ్చయ్య మంచందగ్గరగా వస్తాడు.]

పిచ్చి : బుల్లెమ్మా ! సత్తెమిచ్చాడు సూడు.

సీత : (తుల్లిపడి లేచి) ఏమిటీ ?

పిచ్చి : ఊళనుదగ్గర, ఏదో వూరెల్లిపోతున్నానని యిదిచ్చాడు.

[ఉత్తరం యిస్తాడు]

సీత : (కవరు తీసుకుని కంగారుగా చింపుతుంది. దానిలో అయిదురూపాయల కాగితాలకట్ట ఒకటీ, ఒక ఉత్తరం వుంటుంది. ఉత్తరం ఆత్రతగా చూస్తుంది) "సీతా ! మిమను అమ్మేశాను. యాభైరూపాయలు మాత్రమే పంపిస్తున్నాను, తీసుకో."

పిచ్చయ్య తాతా ! త్వరగావెళ్లి సత్యాన్ని తీసుకు రా. నాకు డబ్బు అక్కర్లేదని చెప్పు. తన డబ్బు వచ్చి తీసుకోమని చెప్పు.

పిచ్చి : ఎక్కడ కెళ్లిపోయాడో ?

సీత : ఏమని చెప్పాడు ?

పిచ్చి : దానిలో అయిదు రూపాయలు నా కిచ్చినాడు. బతికి చెడ్డోణ్ణి, అబద్ధ మాడేననుకునేవ్.

సీత : యింకేం చెప్పాడు తాతా?

పిచ్చి : మీ అన్నయ్య వచ్చేవరకూ యీ డబ్బెట్టి గడుపుకో మన్నాడు.

సీత : యింకేం చెప్ప లేదూ?

పిచ్చి : బెంగపడొద్దన్నాడు. బుల్లెమ్మా! ఆ మొగం చూత్తే నా కడుపు చెరువైపోయింది. బుల్లెమ్మా! మాట్లాడు తుంటే గుడ్లలో నీళ్ళు కూడా తిరిగాయ్.

సీత : కళ్ళల్లో నీళ్లు తిరిగాయా?...ఏమన్నాడా?

పిచ్చి : అదే అనుకుంటున్నాను బుల్లెమ్మా! నువ్వేమన్నాగని అన్నావా?

సీత : వెళ్ళిపొమ్మన్నాను తాతా. మరి మా యింటికి ఎప్పుడూ వస్తూ పోతూవుంటే లోకులేమనుకుంటారు?

పిచ్చి : ఏమనుకుంటా రేంటి? మీ రవాదులైపోయారని, ఏదో సాయంచేద్దామని వత్తున్నాడేమో. అల్లా అనొచ్చా బుల్లెమ్మా?

సీత : తప్పు చేశానంటావా తాతా?

పిచ్చి : తప్పా, మరీతప్పు. మీ గురించి ఎన్నెన్ని కష్టాలుపడ్డాడు. ఎంతెంత సాయంచేశాడు. ఆమాత్రం గేనం లేదా బుల్లెమ్మా? పొగరబోతైతే అయ్యాడు. మనసు మా సక్కటి మనసమ్మా.

సీత : (ఏడుస్తూ) సత్యం.........

పిచ్చి : అయ్యో పిచ్చిదానా. దిక్కూ దివాసంలేని రోజుల్లో...
దేవుడిలా కాపాడే సత్తాన్ని కాదన్నావా?

సీత : యిదిగో పిచ్చియ్యతాతా! నీ అయిదు రూపాయలూ, సత్యమెక్కడన్నా కనుపిస్తే ఒక్కసారి రమ్మని చెప్పు.

పిచ్చి : అలాగే!

సీత : ఎక్కడ కనుపించినా సరే, చెప్పు పిచ్చయ్యతాతా. నీకు డబ్బిచ్చినట్టు ఎవరితో చెప్పకేం?

పిచ్చి : చెప్పనుగాని, పంతులుగారు చూశారమ్మా.

సీత : ఎలా చూశారు?

పిచ్చి : సత్యం డబ్బిస్తుంటే చూశాడు. చూసినోడూరుకున్నాడా, శంకరంగారితో గూడ చెప్పాడు బుల్లెమ్మా. నాయన కాలే పడ్డాడు. పొండ్రాశ అని గదుముకొని అట్టు కొచ్చాను.

సీత : అంతా చూశారా? అంతా వస్తున్నారా? నే నివ్వను. నా ప్రాణంపోయినా యివ్వను...యిది నా సత్యం డబ్బు. దాచుకుంటాను. (లోపలికెళ్ళబోయి ఆగి) తాతా! అబ్బ ఆకలేస్తోంది. చిల్లరేమన్నా వుందా?

పిచ్చి : నాదగ్గ రెక్కడుంది బుల్లెమ్మా!

సీత : యివిగో! ఈ అయిదు రూపాయలూ.

[శంకరం వస్తాడు]

సీత : వచ్చారా! నా దగ్గర డబ్బులేదు, వెళ్ళిపొండి.

శంక : చేతుల్లోపెట్టుకొని అబద్ధమాడతా వేందుకు? నాకు కళ్లులేవూ? పిచ్చియ్యా విన్నావా?

పిచ్చి : నాకెందుకుబాబ్ గొడవ వెళ్తాను బాల్లెమ్మా!
(వెళ్తాడు)

సీత : ఇది నాడబ్బుకాదు. మావారి డబ్బు. శంకరంగారూ! అన్నయ్య వచ్చిన తర్వాత యిస్తాను మీరు వెళ్ళిపొండి.

శంక : రేపు సత్యనారాయణ వ్రతం వందరూపాయల ఖర్చు వుంది. చేతిలో కానీ కూడా లేదు. సీతా! నీవు యివ్వక పోతే ఏవిధంగానూ లాభం లేదు.

సీత : ఏం చేస్తాను?

[పంతులు వస్తాడు.]

సీత : పంతులుగారుకూడా వచ్చారు. నేనెవ్వరికీ యివ్వను. వెళ్ళిపొండి. (లోనికి వెళ్ళబోతూ వుంటుంది.)

పంతు : ఆగు.

సీత : ఎందుకు?

పంతు : నాది పెద్దమొత్తం కాదు. ఎనిమిది రూపాయలు లేకపోయినా, అయిదు రూపాయలు పడేయ్ వెళ్ళి పోతాను.

సీత : అయిదు రూపాయలేగా! యిస్తాను.

శంక : నామాటేం చెప్పావ్?

సీత : మీకెంత యివ్వాలి?

శంక : నలభై రూపాయలు.

సీత : నలభై రూపాయలే! ఎవ్వరికీ యివ్వను. యిద్దరూ వెళ్ళండి...ఊఁ...వెళ్ళిపొండి.

పంతు : అయిదు రూపాయలిస్తానన్నావుగా !

సీత : మీకిస్తే ఈయనకూడా యివ్వాలి.

శంక : నా బాకీ యివ్వందే వూరుకోను.

సీత : ఏమండీ ! మీకు దయ లేదూ ? ఆకలితో మలమల మాడి పోతున్నానే, అన్నయ్య ఖైదులోకెళ్ళిపోయాడే, మా కాధారం ఎవరో చెప్పండి. యీ డబ్బున్నా వుంచండి బాబూ.

పంతు : సీతా ! మర్యాదగా యిస్తేనే యిచ్చావ్.

సీత : లేకపోతే ?

శంక : దౌర్జన్యంగా తీసుకోవలసి వుంటుంది.

సీత : ఆగండి.

పంతు : అలా వీల్లేదు యిచ్చివేయాలి.

సీత : నేనివ్వను, ఎవరికీ యివ్వను. (లోపలకు వెళ్ళిపోతూ వుంటుంది. చలపతి వస్తాడు)

చల : సీతా ! (బిగ్గరగా)

సీత : ఏం ?

చల : చాలా అపాయం జరిగింది.

సీత : ఎవరికి ?

చల : రంగడికి.

సీత : ఏం జరిగింది ?

చల : ఇంజను మీదనుంచి కాలుజారి క్రిందపడ్డాడు.

సీత : ఆఁ...(పరాకుగ చేతిలో డబ్బు విడుస్తుంది. పంతులూ, శంకరం తీసుకుంటారు)

ఆహారంకోసం బయలుదేరు. ఆకలిముందు కులమతాలూ, వంశమర్యాదలూ, నీతి అవినీతీ దాసోహం కావలసిందే. ఆలోచనకు తావిచ్చి ఆలశ్యం చేశావా ప్రాణాలు పోతాయి. ప్రాణం పోయినతర్వాత అన్న లేడు, తమ్ముడు లేడు. వెళ్లు! నీ శరీరం నిలవాలంటే శరీరాన్నే వినియోగించు. శరీరాన్ని తాకట్టుపెట్టు. నీతినీ, న్యాయాన్నీ నిలువునా ఖండించు, వెళ్ళు, వెళ్ళు.

సీత : (వెర్రిగా) చలపతిగారూ! వస్తున్నా. (వెళుతుంది)

[సీత వెలుపలకు వెళ్లగా కారుహారన్ రెండుసార్లు మ్రోగుతుంది.]

రంగ : అక్కా...అక్కా...ఎక్కడికి వెళ్లావే...అక్కా......
అబ్బబ్బ. (మంచంమీద కూర్చుంటాడు)

[ఎడమచేతికి కట్టుకట్టి, నుదుట గుడ్డ తగిలించి వుంటుంది. బాధగా లోపల ప్రవేశిస్తాడు రంగడు. ఎవరూ కనుపించరు. గదిలోకి వెళ్ళి చూస్తాడు. మళ్లీ వెలుపలకు వస్తాడు.]

[పిచ్చియ్య ఒకబుట్టలో అరటిపళ్ళు, ఇతర తినుబండారాలతో వస్తాడు. రంగడు ఆశ్చర్యంగా చూస్తాడు. బుట్ట పరిశీలిస్తాడు.]

రంగ : ఎక్కడివి పిచ్చియ్యతాతా?

పిచ్చి : (సమాధానం చెప్పక)

రంగ : అన్నయ్య జైలునుంచి విడుదలయ్యాడా?

పిచ్చి : యింకా లేదు బుల్లోడా.

రంగ : మరెక్కడివి?

పిచ్చి : మీ అక్క......

రంగ : (భయంగా) మా అక్క...ఎక్కడున్నా కన్నంవేసిందా? ఏం తాతా? మాట్లాడవ్వా? అక్కేది? ఎక్కడా కనుపించదే?

పిచ్చి : ఏం చెప్పను బుల్లోడా.

రంగ : ఏం?

పిచ్చి : కళ్లుమూసుకొని కాలం గడిపేయడం మంచిది బుల్లోడా కడుపు కోసుకుంటే కాళ్ళమీద పడద్ది.

రంగ : (కోపంగా) తాతా!

పిచ్చి : (భయంగా చూస్తాడు)

రంగ : సరిగా చెబుతావా చెప్పు. తలా తోకా లేకుండా చెబితే నీమర్యాద దక్కనివ్వను.

పిచ్చి : చెప్పేదేముంది...రంగనాథం యింటికెళ్లింది. పైగా కారెక్కెళ్లింది. తోవలో నన్నుచూసి కారాపుచేసి, చలపతిగారు యీ సామానులు కొనిచ్చారు నీ కిమ్మని.

రంగ : ఎవరూ? మా అక్క!

పిచ్చి : ఔను.

రంగ : ఎందుకెళ్లింది?

పిచ్చి : ఎందుకేంటి బుల్లోడా. వ్రతం చెడగొట్టుకోడానికి.

రంగ : తాతా! మా అక్కను నీ కుంతురనుకుంటున్నావేమో? మా అక్క అలాంటి చెడ్డగుణం కలదికాదు.

పిచ్చి : ఓ మాసెడ్డ పతివ్రత.

రంగ : తాతా!

పిచ్చి : యూఁ! నేను కానిమాటన్నానా ?

రంగ : కానిమాటే; మా కుటుంబంమీద నీకేమన్నా కక్షుంటే మగాణ్ణయిన నన్నేదన్నా అను. కాని అక్కనంటే !

పిచ్చి : ఇదిగో ! బుల్లోడోయి ! నా ప్రమాణకంగా మీ అక్క తప్పుడుదారి తొక్కినమాట నిజం. కాదని నిన్వనిపిస్తే, చెప్పుదెబ్బలు తింటాను ?...నమ్మవా ?

రంగ : (భయాందోళనగా) నిజమా తాతా ! నిజమా, ఇంత నీచమైనపని చేసిందా అక్క ! తన జీవితానికి మచ్చ తెచ్చుకుందా అక్క !

[మాస్యం మాసిన తలతో, శుష్కించిన ముఖకవళికలతో, వస్తాడు. రంగణ్ణి ఆశ్చర్యంగా చూస్తాడు. రంగడుకూడా చూస్తాడు.]

సూర్యం : రంగా !

రంగ : అన్నాయ్ !

[ఆలింగనం చేసుకుంటారు. యిద్దరి కళ్ళకెంబడీ నీళ్లు కారతాయి.]

రంగ : (ఏడుస్తూ) నాన్న చచ్చిపోయాడు.

సూర్యం : (శిరస్సు వ్రేలేస్తూ) విన్నాను రంగా ! కష్టాలన్నీ కట్ట కట్టుకొని మన మీదికే వచ్చాయి. ఏమిటీ కట్టు ?

పిచ్చి : నువ్వెళ్లిపోయ్యాక మిల్లులో చేస్తాడుగా ... కాలుజారి పడ్డాడు. చేయి విరిగిపోయింది.

సూర్యం : విరిగిపోయింది...చేయికూడా విరిగిపోయింది. మనందరి జీవితాలూ విరిగిపోయాయి. ఆ రంగనాథం దాహం తీరి పోయింది. చెల్లాయి ఏదీ ?

[మాట్లాడడు]

ఎముకగా వస్తుందనుకున్నాను. ఎక్కడా కనుపించదేం రా రంగా! ఆకలితో మంచం ఎక్కిందా? చెల్లాయీ!

[లోపలకు వెళ్ళబోతాడు]

పిచ్చి : బుల్లోడా!

సూర్యం : ఏం?

పిచ్చి : తిండికేమీ యిబ్బంది లేదులే—

సూర్యం : యిబ్బంది లేదూ? గంగడు సంపాదించాడా? చెల్లాయి ఆరోగ్యంగా వుందా?

పిచ్చి : వుంది.

సూర్యం : వుందా! రంగడే నాకన్నా చాల తెలివైనవాడు. చెల్లాయి ఆకలి తీర్చాడు. నేనుండగా యింటిల్లిపాదినీ పస్తుపెట్టాను. మా నాన్నను తిండిపెట్టలేక చంపేశాను. (కళ్ళంబడి నీళ్ళువస్తాయి)

రంగ : అన్నయ్యా!

సూర్యం : ఔను. నేను పాపపాత్రుడను, యిది సంతోషసమయం. నాకు శిక్షపడలేదు. లైసెన్సుకూడా వచ్చేసింది. ఏదీ నా చెల్లాయి? ఈ సంతోషవార్త చెప్తాను.....ఎంతగానో ఆనందిస్తుంది. ఈ లైసెన్సు చూసి, మురిసిపోతుంది. చెల్లాయ్! చెల్లాయ్!

[లోపలకు వెళతాడు. పిచ్చియ్య, రంగడు అగమ్యంగా చూస్తుంటారు. సూర్యం తిరిగి వస్తాడు.]

సూర్యం : (అనుమానంగా) ఏదీ యింట్లో లేదే? ఎక్కడికెళ్ళింది రంగా?

రంగ : నేను వచ్చేప్పటికే యింట్లో లేదు.

సూర్యం : ఏం పిచ్చియ్యతాతా ?

పిచ్చి : (మాట్లాడడు)

సూర్యం : (బిగ్గరగా) పిచ్చయ్యతాతా !

పిచ్చి : ఏం చెప్పను.

సూర్యం : చెప్పాలి.....తప్పదు. నా చెల్లాయిని చూడాలి. ఎక్కడుందో ? ఎలావుందో ? చూడాలి.

పిచ్చి : దానికేం రాయిలావుంది.

సూర్యం : ఎక్కడ ?

పిచ్చి : రంగనాథం దగ్గరే.

సూర్యం : (ఒక్కసారి నిర్ఘాంతపోతాడు) ఆఁ.....రంగనాథం దగ్గరా...రంగనాథం దగ్గర.

పిచ్చి : అవును బుల్లోడా. చలపతివచ్చి తీసుకుపోయాడు.

సూర్యం : ఎందుకూ ?

పిచ్చి : యింకెందుకూ? నా కూతురు బతుకులాగే కాలిపోటానికి.

సూర్యం : (ఉన్మాదంగా) నీకూతురు బతుకులా కాలిపోటానికి... నీ కూతురు బతుకులా కాలిపోటానికి, పిచ్చియ్యతాతా! నువ్వు దొంగవు ! నువ్వే చేశావు...నువ్వే ప్రాణంతం చావ్. నువ్వు నీచుడవు.

[వెళ్ళి భుజాలు పట్టుకుంటాడు]

రంగ : అన్నయ్యా !

పిచ్చి : దణ్ణం బాబో.

సూర్యం : (విడిచిపెడతాడు) పిరికివెధవలు. నిన్నేంచేయను. నిన్ను చంపితేమాత్రం లాభమేముంది. చెల్లాయి! చెల్లాయి కాదు, విషనాగు. దాన్నే చంపుతాను. (వెళ్ళబోతాడు)

రంగ : (ఏడుస్తూ) అన్నయ్యా అక్కను చంపేస్తావా?

[సూర్యం వెనక్కు తిరిగి]

సూర్యం : ఔను...చంపుతాను. నీకు భయంగా వుందా! అక్క రక్తంచూడ్డం అంత భయమైతే కాస్సేపు కళ్ళుమూసు కుందువుగాని. లేదా, బైటకు వెళ్ళిపోదువుగాని. (వెళ్ళి పోతాడు.)

రంగ : పిచ్చియ్యతాతా! అక్కను రక్షించాలి. ఆమె చెడ్డపని చేస్తే వూర్నుంచి పారిపొమ్మను. వూళ్ళో వుండవద్దని చెప్పు. తాతా వెళ్ళు. (పిచ్చియ్యతాత వెళతాడు)

[రంగడు మంచంమీద కూలబడి ఏడుస్తూ వుంటాడు. మెల్లగా సత్యం వస్తాడు. రంగడు చూస్తాడు.]

రంగ : బావా!

సత్యం : రంగా!

రంగ : చాలా అపాయం జరుగుతుందిబావా! అన్నయ్య అక్కను చంపడానికి వెళ్ళాడు.

సత్యం : కారణం?

రంగ : రంగనాథమింటికెళ్ళిందని.

సత్యం : అంతేనా?

రంగ : కాదు...మళ్ళీ మనం తలలు ఎత్తుకు తిరగకుండా చేసింది.

సత్యం : నిజమా ?

రంగ : పిచ్చియ్యతాతే చెప్పాడు.

సత్యం : ఎప్పుడు వెళ్ళింది ?

రంగ : ఈరోజునే.

సత్యం నువ్వు లేవా ?

రంగ : ఉహూం. చేయివిరిగింది. చలపతి హాస్పటలుకు తీసుకువెళ్ళి కట్టు కట్టించాడు. అక్కతో చెప్పివస్తానని బయలు దేరాడు. మళ్ళీ నాకు రాలేదు. నేను యింటికి రావడం ఆలస్యమైయింది.

సత్యం : నేను పంపిన డబ్బు అందలేదూ ?

రంగ : నాకు తెలీదు.

[సత్యం వెళ్ళిపోతాడు. రంగడు చేయిబాధవల్ల మంచంమీద పడు కుంటాడు మంచి దుస్తులతో ముసుగువేసుకొని సీతవస్తుంది. వెనకాల పిచ్చియ్యతాత వస్తాడు. పిచ్చియ్యవెళ్ళి రంగణ్ణి లేవగొట్టబోగా, సీత భయంగా వద్దనిచెప్పి, లోపలకు వెళ్ళిపోతుంది. సీత వెళ్ళిన తర్వాత అలికిడి విని రంగడు లేస్తాడు. పిచ్చియ్యచేతిలో రొట్టె, పాలగ్లాసు వుంటుంది.]

రంగ : ఏం తాతా ! కనుపించలేదూ ?

పిచ్చి : కనిపించింది బాబూ !

రంగ : నేను చెప్పింది చెప్పావా ?

పిచ్చి : చెప్పాను కాని వినలేదు.

రంగ : వినలేదూ ? వినదు. ఎందుకంటుంది...దాని చావు దగ్గర కొచ్చింది. కాబట్టే వినలేదు. రంగనాధంగాడు కాపాడు

తాడని కళ్ళు పొరలుగమ్ముకు పోయాయనుకుంటాను. సరే, యిలాంటిది చచ్చినా ఫరవాలేదు.

[వెళ్ళి మంచంమీద కూర్చుంటాడు]

పిచ్చి : కట్టకాలమే కానిపనులు చేయిస్తాది...బాబూ నీ గురించి ఎంత ఏడ్చిందనుకున్నావ్......యివిగో పాలూ, రొట్టె కూడ యిచ్చింది తీసుకో బాబూ.

రంగ : (ఏడుస్తూ) వద్దు తాతా !

పిచ్చి : తమ్ముడన్నా, అన్నగారన్నా, ఆ సీతమ్మకు ఎంత దయ. ఆకరికి సత్తాన్నికూడా ఆనలకి పోమ్మంది. నలుగురూ ఏమన్నా అనుకుంటారని. పాపం! సరే, బాబూ యివి తీసుకో ఆకలిమీ ఉదుటౌతాది ప్రాణం.

రంగ : నేను తినలేను తాతా ! తీసుకెళ్ళి అక్కడ పెట్టెయ్యి.

పిచ్చి : అలాకాదు బాబూ తీసుకో. తినకపోతే మీ అక్క ఏడుస్తాది.

రంగ : నీతోనే చెబుతున్నాను తాతా ! నా కక్కక్లేదు. తీసుకు వెళ్లిపో.

పిచ్చి : బాబ్బాబు. (దగ్గరగా వెడతాడు)

రంగ : (పిచ్చియ్య చేతిలోవున్న సామానులు విసిరికొడతాడు.) ఫో...అదిచ్చిన ఏ వస్తువైనా నేను తీసుకోను. విషంతో సమానం. అది నా కక్కకాదు. (ఎనుకుగా చూస్తాడు. గుమ్మంలో విచారంగా, బాధగా, ఆశ్చర్యంగా రంగడి కేసి సీత చూస్తూ నిలబడి వుంటుంది.)

పిచ్చి : సీతమ్మా! నువ్వే సెప్పమ్మా.

రంగ : (చూపులో ముందు ప్రేమ, తర్వాత ఈర్ష్య, వెనుక క్రోధం చుట్టుముట్టుకొస్తాయి.) ఏం తాతా? యింట్లోకి తీసుకొచ్చి అబద్ధ మాడుతున్నావ్.

పిచ్చి : నాకెందుకు బాం బీగొడ్డన. (వెళ్ళిపోతాడు)

రంగ : (సీతను చూసి) ఎందుకొచ్చావ్ మళ్లా? ఏంపని చేశావ్?

సీత : (ఏడుస్తూ) రంగా! చేయాలని చేయలేదు. ఏలాగు చేశానో, నాకాళ్లు ఎలాగు నడచివెళ్ళాయో నాకే తెలియదు. కాలే కడుపుతో, ఎండే డొక్కలతో, కేవలం తిండికోసం—అన్నయ్యనూ, నిన్నూ చూడ్డానికి ప్రాణం నిలుపుకోవడం కోసం, ఆ చలపతి సహాయంతో రంగనాథం గుమ్మం తొక్కాను. తిండిపెడతానని లోపలకు తీసుకెళ్ళాడు. అన్నంపెట్టాడు. తీసుకువెళ్ళి గదిలోపెట్టి బంధించాడు. ఒకమూల రంగనాథం కూర్చొని వున్నాడు. నన్నుచూసి వికటంగా నవ్వాడు. కెవ్వున కేకవేసి స్పృహ తప్పి పడిపోయాను. నేను ఎవ్వరికీ మొహం చూపలేక లోపల దాక్కున్నాను. నాకన్నా చిన్నవాడవు. నీకు సిగ్గుపడే నీ ఎదుటకు రాలేకపోయాను. తప్పచేశాను... నేను చేసినతప్పు నా రంగడికి ఆలోచించుకునే శక్తి యిచ్చింది. ఆడుతూ, పాడుతూన్న రంగడి మెదడులో యింత విశాలమైన ఆలోచన లున్నాయని గ్రహించలేక పోయాను. కొట్టి తింటావా?

రంగ : అక్కల్లేను.

సీత : ఆకలి కావడంలేదూ ?

రంగ : కడుపు నిండుగానే వుంది.

సీత : అక్క చేసినపని ఆకలి తీర్చినట్లుంది.

రంగ : నీకు సిగ్గులేదూ ?

సీత : చచ్చేదానికి సిగ్గెందుకూ ?

రంగ : అంత నీచమైనపని చేయకపోతే మాడి చావలేకపో యావూ ?

సీత : చెప్పడం సులభమే. కాని......

రంగ : చేయడం కష్టం.

సీత : అవును. నా బ్రతుకుమీద నాకు తీపిలేదనను. గాని కొందరి బ్రతుకులు నేను లేకపోవడంవల్ల నాశనమౌతా యని యింతవరకూ బ్రతికున్నాను.

రంగ : అన్నయ్య వస్తాడేమో ఏం చెప్తావ్ ?

సీత : అబద్ధం చెప్పను.

రంగ : అబద్ధం చెప్పినా దాగదుగా.

సీత : అందుకు నిజం చెప్పాలనికాదు. బ్రతుకుమీద ఆశలేన ప్పుడు ఏదిచెప్పినా ఒకటే.

రంగ : చచ్చిపోవడం నీకంత తేలిగ్గా వుందా ? అన్నయ్య రాక ముందే ఎక్కడికన్నా వెళ్ళిపోరాదూ ?

సీత : రంగా !

రంగ : ఔను. అన్నయ్య వస్తే నిన్ను బ్రతకనివ్వడు. చచ్చేం సాధిస్తావ్ ? నామాట విను. ఎక్కడికన్నా వెళ్ళిపో.

సీత : వెళ్ళలేను రంగా. చాటుగా బ్రతకడం నేను నేర్చుకో లేదు. స్వచ్ఛంగా బ్రతకాలనుకున్నా, పరిస్థితులు నా బ్రతుకుమీద ఒక నల్లమచ్చను ఏర్పర్చాయి. ఈ మచ్చకు యింకో మచ్చ చేర్చుకొని మరీ చీకటిబ్రతుకు బ్రతకలేను.

[సూర్యం వస్తాడు. మనిషి కోపంతో మండిపోతూ వుంటాడు. చెల్లెల్ని చూస్తాడు. రంగడు కంగారుగా లేస్తాడు. సీత అన్న స్వరూపాన్ని చూసి భయపడుతుంది. తర్వాత ధైర్యం తెచ్చుకుంటుంది.]

సూర్యం : ఎంత ఘోరంచేశావ్ ?

సీత : చేశాను.

సూర్యం : మా వంశానికి మచ్చ తెచ్చావు. నాన్న బ్రతుక్కి కళంకం తెచ్చావు. మా తలలు త్రెంచేశావు.

సీత : అవును.

సూర్యం : నిన్ను చంపేముందు ఒకటడుగుతాను. నిజం చెబుతావా ?

సీత : ఆ.

సూర్యం : నన్ను జైలునుంచి విడుదల చేయించింది నువ్వేనా ?

సీత : రంగనాథంగారితో చెప్పాను. అంతే.

సూర్యం : నా గురించే రంగనాథం దగ్గరకు వెళ్లావా ?

సీత : నా కాలేకముందు గురించి.

సూర్యం : పదునున్న త్తి చేశావ్.

రంగ : అక్క చెయ్యాలని చెయ్యలేదు. చలపతే తీసుకెళ్ళాడు.

సీత : ఎవరు తీసుకెళ్లినా, ఎవరు వంచించినా, నేను పతిత నయ్యాను. పిచ్చియ్యతాత కూతురు జీవితం గురించి

అసహ్యించుకొన్నాను. సత్యం ఆమెను సమర్థిస్తుంటే సహించలేకపోయాను. కాని నా గురించి ఎవరూ కష్టపడ్డం, నష్టపడ్డం నా కోరిక కాదు. ఇదిగో అన్నాయ్! (కైజాను తీసి) తీసుకో. ఒకనాడు నీ చేతిలోంచి లాగి దాచిన కైజాను. ఆలోచించక తీసుకో.

సూర్యం: (ఆలోచిస్తూ అందుకుంటాడు) యిలా వేస్తే నేను విడచి పెడతానని ఆలోచిస్తున్నావా?

సీత: అన్నాయ్.

సూర్యం: లేకపోతే ఈ పనేమిటి? నీ విషయం తెలిసింది. తెలిసినప్పుడే నాతల వాలిపోయింది. వాలినతల రాలిపోవడమే నా కిష్టం. అయితే నా తల నేలకొరిగే ముందు నా తల వంపులకు కారణమైన నిన్ను విడచిపెడతానని అనుకోవద్దు. అన్నయ్య జైల్లోకిపోయి, నాన్న చచ్చిపోయి, రంగడిచేయి విరిగిపోయి, కుటుంబమంతా నాశనమైపోయుంటే, నువ్వు కుమిలి చావాల్సిన దానికిబదులుగా, ఆ రంగనాథం చేతుల్లో కులకడానికి యిల్లు విడిచావా, యిక అన్నయ్య జైల్లోనే చచ్చిపోతాడని, రంగడు ఆస్పత్రిలోనే ప్రాణం విడుస్తాడనీ, ఆ రంగనాథాన్ని అండగా చేసుకోడానికి నేనంటూ బయల్దేరావా?

సీత: అన్నాయ్! (కోపంగా) అనవసరంగా మాట్లాడకు. నేను నిన్ను ఎదిరించి ఎప్పుడూ మాట్లాడలేదు. ఇప్పుడు మాట్లాడకుండా వుండటానికి ప్రయత్నం చేస్తే, నన్ను మరీ నీచంగా అర్థంచేసుకుంటున్నావ్. రంగనాథం అండ

నా జీవితానికి ఆధార మనుకుంటే, ఈగుమ్మం తొక్కను. యింతగా మాట్లాడనివ్వను. అసలు నిన్ను యింత త్వరగా యిల్లు చేరుకోనివ్వను. యింతగా కుమిలి చావను...... యీ బాధ మీ గురించికాదు...సమాజం గురించికూడా కాదు. పవిత్రమైన భారతనారి ఆదర్శాన్ని కోల్పోయా నని బాధపడుతున్నాను.

సూర్యం : రంకునేర్చినది బొంకునేర్వడం ఆశ్చర్యం లేదు.

సీత : దొంగవాడు వింతగా మాట్లాడుతున్నాడని నేనంటే.

సూర్యం : ఎవరు దొంగ?

సీత : రంకునేర్చిన దెవరు?

సూర్యం : నువ్వే నువ్వు.

సీత : దొంగవు నువ్వే.

సూర్యం : ఆఁ! నేనా, నేనా...నీ గురించి...నాన్న గురించి... ఆహారం తీసుకవస్తే, దొంగక్రింద జమకడతావా? వ్యభిచారీ! కులటా! దుర్మార్గురాలా!

[సూర్యం చెల్లెలి కంఠాన్ని పట్టుకుంటాడు. ఆమె కళ్లు తేలవేస్తుంది. రంగడు అడ్డుపడతాడు. సూర్యం రంగణ్ణి కాలుతో గెంటివేస్తాడు. రంగడు పడిపోతాడు. సూర్యం మరీగట్టిగా చెల్లెలి కంఠాన్ని నొక్కుతాడు. ఆమె భీకరంగా కెవ్వున అరుస్తుంది. సత్యం కంగారుగా వస్తాడు.]

సత్యం : ఆగు.

సూర్యం: ఆపుచేయడానికివీల్లేదు. ఆపుచేశావా నీమర్యాద దక్కదు

[సూర్యం చేతులు పెనగలాగి సీతను చూస్తాడు. సత్యం చేతిలోనుంచి తప్పించుకొని క్రిందకు వాలిపోతుంది. రంగడులేచి సీత మొహంలోకి చూసి "అక్కా" అని బిగ్గరగా అరచి క్రిందపడిపోతాడు.]

TPLA101B103

సత్యం : (సీతను పరిశీలిస్తాడు. సూర్యాన్ని చూస్తాడు) నీ కోర్కె నెరవేరింది. ఆమె చచ్చిపోయింది.

సూర్యం : (భయంగా) చచ్చిపోయిందా! (బింకంగా) చావవలసిందే.

సత్యం : చావవలసిందే. వ్యభిచారానికి శిక్ష చావు. ఈ వ్యభిచారానికి కారణం? సమాధానం చెప్పవేం? నువ్వు దొంగతనం చేయడానికి కారణం?......ఆకలికోసం— అన్నని జైలునుంచి విడుదల చేయడం కోసం — నీకు లైసెన్సు యిప్పించడం కోసం.........శరీరాన్ని తాకట్టు పెట్టింది. క్షుద్బాధ తీర్చుకుంది. అనుకున్న పనులన్నీ నిర్విఘ్నంగా చేసింది. నువ్వు దొంగతనం చేశావ్...నీ ఆకలి తీర్చుకున్నావా? నీ తండ్రిని రక్షించావా? నీ తమ్ముడిని కాపాడావా?...కార్యభంగంతో కాలుకదిపావు జైలుకి...వీళ్లు ఎలా బ్రతుకుతారనుకున్నావ్... ఈమె పరిస్థితులవల్ల చేసినపనికే ఇంత పెద్ద శిక్షయితే - నువ్వు చేసిన నేరానికి?

సూర్యం : నేరం?

సత్యం : నువ్వు దొంగతనం చేశావ్.

సూర్యం : చేశాను...కారణం ఎవరు?

సత్యం : కారణం తెలియకుండానే నేరాన్ని నిరూపించి మరణా[illegible] శిక్షగా యిచ్చావ్. నీ తప్పునకు నువ్వు కారణం [illegible]

సూర్యం : కాదూ?

సత్యం : సీత తప్పుచేయలేదు.

మనసు ఫౌండేషన్

పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	TRLA 101 B103
పుస్తకం పేరు	[illegible]
తారీఖు	29/10/24
ముందు అట్ట	NO
వెనుక అట్ట	NO
మొత్తం పేజీలు	109
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	NO
లేని పేజీలు	1 to 4,99,100
తయారు చేసినది	akshaya
పేజీలు విడదీసినది	[illegible]
స్కాన్ చేసినది	Susmitha
పరీక్ష చేసినది	pragathi
పేజీలు పరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
స్కాన్ చెయ్యనివి	
తప్పులు	NO
పరిస్థితి	good